
TSN
తరంగిణి
తెలుగు భాషా . సాంస్కృతిక . సాహిత్య పత్రిక
మన భాష
మన సంస్కృతి
మన సంప్రదాయం
మన గర్వ కారణం
సాహిత్యం
సంస్కృతి
సమాజం
సంకల్పం

# తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా

# TSN తరంగిణి

2025-2026

తెలుగు భాష, సాంస్కృతిక, సాహిత్య పత్రిక

■ సేవ ■ సంస్కృతి ■ విద్య

## ఈ సంచికలో


- నా మనోగతం - కొల్లి ప్రసాద్
- ఉగాది కవిత
- సేవ స్ఫూర్తి, సమాజ బాధ్యతకు ప్రతీకగా TSN
- గ్రహం మారినా, గుణం మారునా
- ఎవ్రీడే మామ్స్
- విధి
- దృష్టికోణం
- తెలుగుబడి
- చెట్టు నేర్పిన కథ
- కృత్రిమ మేధస్సు
- చెప్పగలవ
- బారసాల
- పూర్వపు అధ్యక్షుల మాట - మంతే
- TSN స్పోర్ట్స్
- పోటీ వ్యాసం
- ప్రయాణం
- అనురాగ మాధవీయం
- మీరు బలి
- చమక్కులు
- కృతజ్ఞతాభివందనం

# నా మనోగతం

ఆకాశం నాకు విశాలతను నేర్పింది,
భూమి నాకు సహనాన్ని ఇచ్చింది.
సూర్యుడు కర్తవ్య దీక్షను గుర్తుచేశాడు,
చంద్రుడు మృదుత్వపు మాధుర్యాన్ని పరిచయం చేశాడు.
ప్రకృతి ప్రతి అంశం ఒక సత్యాన్ని చెబుతుంది
మనిషి జీవితం తనకోసం మాత్రమే కాదు,
ఇతరుల జీవితాల్లో వెలుగై నిలవడానికీ కావాలి.



నేల మనల్ని మోస్తుంది,
గాలి మనల్ని సాంత్వనపరుస్తుంది,
నీరు మనల్ని నిలబెడుతుంది.
అలానే సమాజం మనల్ని తీర్చిదిద్దుతుంది,
మన వ్యక్తిత్వానికి అర్థం ఇస్తుంది.
అందుకే నా హృదయంలో
సమాజం ఒక దేవాలయం – ప్రజలే దేవుళ్లు.

ఆ దేవాలయంలో సేవ చేయడం
నాకు హోదా కాదు, ఆరాధన.
అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం
నాకు కర్తవ్యం మాత్రమే కాదు, అంతరంగపు పిలుపు.
ఎవరి బాధలోనైనా నా మనసు తడవాలి,
ఎవరి ఆనందంలోనైనా నా హృదయం వికసించాలి
అదే నేను నమ్మే జీవన సారం.

మన తెలుగువారి చిరునవ్వుల్లో నాకు ఆశ కనిపిస్తుంది,
మన పిల్లల భవిష్యత్తులో నాకు రేపటి వెలుగు కనిపిస్తుంది.
మన సంస్కృతిలో మూలాల బలం ఉంది,
మన ఐక్యతలో అపారమైన శక్తి ఉంది.
తెలుగు నా భాష మాత్రమే కాదు
నా భావానికి రూపం, నా ఆత్మకు స్వరం.
తెలుగు సమాజం నా చుట్టూ ఉన్న జనసమూహం మాత్రమే కాదు
నా హృదయాన్ని హత్తుకునే ఆత్మీయ కుటుంబం.

ఒంటరిగా మనం ఒక దీపం కావచ్చు,
కలిసుంటే మనం ఒక దీపావళి అవుతాం.
ఒక్కరి ప్రయత్నం ఒక అడుగు మాత్రమే కావచ్చు,
అందరి సంకల్పం కలిసి నడిస్తే అది ఒక ప్రస్థానం అవుతుంది.

అక్కడే సమాజం శక్తిగా మారుతుంది,
అక్కడే సేవ సంస్కృతిగా వికసిస్తుంది.

నాకు నాయకత్వం అంటే ముందుండి కనిపించడం కాదు,
అందరినీ కలుపుకుని ముందుకు తీసుకెళ్లడం.
నాకు సేవ అంటే మాటల అలంకారం కాదు,
మనసులను కలిపే నమ్మకం.
నాకు జీవితం అంటే స్వప్రయోజనం కాదు,
మనవారి కోసం, మన తెలుగు కోసం,
మన సంస్కృతి నిలిచే రేపటి కోసం నిరంతరం కృషి చేయడం.

భగవద్గీత చెబుతున్న నిస్వార్థ కర్మస్ఫూర్తి
నా ఆలోచనలకు దారిచూపే దీపస్తంభం.
ఫలితం కోసం కాదు, ధర్మం కోసం చేయబడిన పని
ఎప్పటికీ వ్యర్థం కాదు అనే విశ్వాసమే
నా సేవా ప్రయాణానికి ప్రేరణ.

నా హృదయంలో ఒకే సంకల్పం
తెలుగువారి అభ్యున్నతి.
నా చూపులో ఒకే దిశ
సమాజ ఐక్యత.
నా కర్తవ్యానికి ఒకే అర్థం
అవసరమైన చోట సహాయం,
సాధ్యమైన చోట సేవ,
కలిసిన ప్రతి మనసులో ఆనందం నింపడం.

ఆ ప్రేమే నా బలం,
ఆ సేవే నా సాధనం,
ఆ సమాజమే నా ఆలయం,
ఆ ప్రజలే నా దైవస్వరూపం.

తెలుగువారి పురోగతిలో నా ఆనందం ఉంది,
వారి ఐక్యతలో నా ఆశయం ఉంది,
వారి సంతోషంలో నా విజయానికి అర్థం ఉంది.
అందుకే నా ప్రతి ఆలోచన, ప్రతి అడుగు, ప్రతి శ్వాస
మన సమాజం కోసం, మన తెలుగు కోసం.

– ఇదే నా మనోగతం.

**కొల్లి ప్రసాద్**
అధ్యక్షులు, తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా


TELUGU SAMITI OF NEBRASKA
2025-2026
BOARD OF DIRECTORS
Mr. Anoop Manikya
Mr. Chaitanya Ravipati
Mr. Venu Gopal Murakonda
Mrs. Neelima Manchikalapati
Mrs. Lakshmi Madhuri Chinni
EXECUTIVE COMMITTEE
Mr. Kolli Prasad
President
Mr. Alagan Kancharla
General Secretary
Mrs. Ramya Ravipati
Cultural Secretary
Mr. Samba Divvela
Treasurer
Mr. TataRao Kasuri
Vice President
Mr. Ramesh Rayapati
Joint Secretary
Mrs. Vineela Naidu
Joint Cultural Secretary
Mr. Yugandhar Panga
Joint Treasurer
COMMITTEE MEMBERS
Ms. Kranthi Sudha
Mr. Avinash Maduri
Mr. DanaRao Gottipati
Mrs. Sridevi Koraganji
Mr. Veerendra Mupparaju
Mr. Bala Kamireddy
Mr. Anil Pothineni
Mrs. Subhasree Koduru



Telugu Samiti Of Nebraska
LEADERSHIP THROUGH THE YEARS
Mrs. Kranthi Adidam
2012-13
Mr. Satyanarayana Pavuluri
2013-14
Mr. Ashok Madupalli
2014-15
Mr. Mahesh Gudaru
2015-16
Mr. Somashekar Kodali
2016-17
Mr. Narendra Sama
2017-18
Mr. Nagaraju Mudhelli
2018-19
Mr. Sarath Bodepudi
2019-20
Mr. Swamy Talam
2020-22
Mr. Naveen Kantem
2022-23
Mr. Dileep Donepudi
2023-24
Mr. Raja Komatireddy
2024-25
SERVING THE COMMUNITY WITH DEDICATION!

# ఉగాది (కవిత)



రచన: సునీల్ దొడ్డపనేని

వసంత కాలపు పచ్చని సంబరాన
కోయిల కూజిత పాటల ఊటల పైన
కాల చక్రపు రథముపై నుండి జాలువారింది
పరాభవ నామధేయ సంవత్సరం

ధాత్రీ తలమున చైత్ర మాసపు మధుర భావాలు,
గడప గడపను చిగురించిన మామిడి తోరణాలు
గ్రహగతులని వివరించే పంచాంగ ఫలశ్రుతి గీతాలు
మది మదిలోన నిండిన మంగళ శుభోదయాలు

వేప పువ్వు చేదు, చెరుకు గడల తీపి, లవణ కారముల సమ్మేళనము
చింత పులుపు, మామిడి వగరుతో సాగెను జీవిత రస తరంగాల పయనము
మనిషి పథమున ఎదురయ్యే సుఖదుఃఖాల సమతౌల్యము
షడ్రుచుల ఈ విందు మన బ్రతుకు పాఠమునకు నిత్య సిద్ధాంతము
విశ్వజనీనమైన ఈ ఉగాది... అందరి ఇంట కురిపించుగాక సిరిసంపదల అమృత వర్షము!



# సేవ, స్ఫూర్తి, సమాజ బాధ్యతకు ప్రతీకగా TSN



రచన: వీణమాధురి ద్రోణాదుల

నెబ్రాస్కాలో తెలుగు సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సేవా భావం, యువతాభివృద్ధి, కుటుంబ సంక్షేమం, సామాజిక బాధ్యత వంటి విలువలను ఆచరణలో నిలబెడుతూ తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (TSN) విశిష్టమైన గుర్తింపును సంపాదించుకుంటోంది. తెలుగు కుటుంబాలకు ఆత్మీయ అండగా నిలుస్తూనే, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను ముందుండి నిర్వహించడం ద్వారా TSN తన ప్రత్యేకతను చాటుతోంది.

ఇటీవల TSN చేపట్టిన పలు కార్యక్రమాలు సంస్థ సేవా దృక్పథాన్ని మరింత స్పష్టంగా ప్రతిబింబించాయి. చలి కాలంలో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు తోడ్పాటుగా నిర్వహించిన వింటర్ కోట్ డొనేషన్ డ్రైవ్ మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. కొత్త వింటర్ కోట్లు సేకరించి అవసరమైన వారికి అందించడం ద్వారా, సేవ అనేది కేవలం మాటల్లో కాదు, చేతల్లో చూపించాల్సిన విలువ అని TSN మరోసారి నిరూపించింది.

అదేవిధంగా, అవసరంలో ఉన్న కుటుంబాలకు ఆహార సహాయం అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన కార్న్ హస్కర్స్ ఫుడ్ డ్రైవ్ కూడా సంఘం సామాజిక స్పృహకు ప్రతీకగా నిలిచింది. నిత్యావసర ఆహార పదార్థాలు, పిల్లలకు అవసరమైన స్నాక్స్, వ్యక్తిగత పరిశుభ్రత సామగ్రి వంటి వస్తువులను సేకరించి అవసరమైన వారికి అందించే ప్రయత్నం చేయడం అభినందనీయం. సమాజంలో ఒకరి కష్టం అందరిదీ అన్న భావనను బలపరిచే కార్యక్రమంగా ఇది నిలిచింది.

యువత భవిష్యత్తు నిర్మాణంపైనా TSN ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. తొలిసారిగా ప్రకటించిన TSN యూత్ స్కాలర్‌షిప్స్ ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం అందించే స్ఫూర్తిదాయక నిర్ణయం. 2026-2027 విద్యా సంవత్సరంనుంచి ప్రారంభమయ్యే ఈ స్కాలర్‌షిప్‌లు, యువత ఉన్నత విద్యలో ముందుకు సాగేందుకు సంఘం అండగా నిలుస్తోందనే నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. విద్యార్థుల కలలకు తోడ్పడటం అంటే సమాజ భవిష్యత్తును బలోపేతం చేయడమే అన్న ఆలోచనకు ఇది నిదర్శనం.

ఇంకా యువతలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, స్పష్టమైన దిశ పెంపొందించేందుకు TSN ప్రకటించిన మొట్టమొదటి యూత్ కాన్ఫరెన్స్ మరో ప్రశంసనీయ ముందడుగు. మధ్యపాఠశాల, హైస్కూల్, కాలేజ్ విద్యార్థులకు ఉపయోగపడేలా రూపొందించిన ఈ వేదిక ద్వారా కాలేజ్ సిద్ధత, కెరీర్ మార్గదర్శనం, స్ఫూర్తిదాయక సందేశాలు, పరస్పర పరిచయాలు వంటి అంశాలు అందించబడనున్నాయి. భవిష్యత్ తరాలకు సరైన మార్గనిర్దేశం చేయాలనే సంఘం సంకల్పం ఈ కార్యక్రమంలో స్పష్టంగా కనిపిస్తోంది.

కుటుంబాల భవిష్యత్ భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఎస్టేట్ ప్లానింగ్ సెమినార్ కూడా అత్యంత ప్రాముఖ్యత గల కార్యక్రమంగా నిలిచింది. విల్, ట్రస్ట్ వంటి అంశాలపై నిపుణుల ద్వారా అవగాహన కల్పించడం ద్వారా, కుటుంబాలకు ఉపయోగపడే చట్టపరమైన మరియు ఆర్థిక మార్గదర్శకత్వాన్ని TSN అందించింది. విదేశాలలో స్థిరపడిన కుటుంబాలకు ఇలాంటి అంశాలపై అవగాహన ఎంత అవసరమో గుర్తించి, సమయానికి అవసరమైన దిశానిర్దేశం చేయడం సంస్థ దూరదృష్టిని తెలియజేస్తోంది.

ఈ కార్యక్రమాలన్నింటినీ సమగ్రంగా పరిశీలిస్తే, TSN లక్ష్యం కేవలం సాంస్కృతిక వేడుకల నిర్వహణలోనే పరిమితం కాలేదని స్పష్టమవుతుంది. సేవా కార్యక్రమాలు, యువతాభివృద్ధి, విద్యా ప్రోత్సాహం, కుటుంబ సంక్షేమం, సామాజిక చైతన్యం వంటి అనేక రంగాల్లో సమన్వయంతో ముందుకు సాగుతూ, తెలుగు సమాజాన్ని మరింత బలంగా నిర్మించాలనే సంకల్పంతో TSN పనిచేస్తోంది, అదే దీనికి ప్రత్యేకతను తీసుకువస్తోంది.

నేటి సమాజానికి అవసరమైనది మాటలకన్నా కార్యాచరణ. ఆ కార్యాచరణను నిబద్ధతతో, సేవాభావంతో, సమాజపట్ల బాధ్యతతో అమలు చేస్తూ తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా అందరి ప్రశంసలను అందుకుంటోంది. నెబ్రాస్కాలో తెలుగు సమాజ గౌరవాన్ని మరింత పెంచుతూ, భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తున్న TSN ఇలాగే మరెన్నో సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని ప్రతి తెలుగు కుటుంబం ఆకాంక్షిస్తోంది.



# TSN - యూత్ కాన్ఫరెన్స్

















# గ్రహం మారినా.. గుణం మారునా?

(హాస్య వ్యాసం)

సేకరణ: సునీల్ దొడ్డపనేని

మనిషికి గ్రహాంతరవాసులంటే ఎప్పుడూ ఆసక్తే. కాకపోతే ఒక విషయం ఎప్పుడూ అర్ధం కాదు.

భూమి మీద నివసిస్తున్న ఈ జనాలే కులాల పేరుతో, మతాల పేరుతో, ప్రాంతాల పేరుతో, దేశాల పేరుతో, ఇక మరేదీ దొరకదంటే ఆడ, మగ అని తన్నుకు చస్తున్నారు. కానీ మళ్ళీ గ్రహాంతర జీవులంటే అందరికీ ఆసక్తే.

ఈ గ్రహాంతర జీవులు ఖర్మ కాలి దొరికారనుకోండి, ఇలా ఉండొచ్చేమో అనిపిస్తుంది. ఎవడికో ఒకడికి మళ్ళీ ఆ గ్రహాన్ని ఆక్రమించాలనే ఆలోచన వస్తుంది. అది బలపడుతుంది. మళ్ళీ ఆ గ్రహానికి మనకూ మధ్య ఒక ఒప్పందం, ఒక చర్చ! కొన్ని కొన్ని లాజిక్కులు కూడా బయలుదేరుతాయి.

ఆ గ్రహంలో జీవులకు బ్రతకడం అంటే తెలియని రోజుల్లోనే మన గ్రహం మీద మనుషులు నాగరికంగా బ్రతికారు, మనమే గొప్ప, మనమే గొప్ప అంటూ చంకలు గుద్దుకోవడం మొదలౌతుంది. కొంత మంది తెలివైనోళ్ళు మాత్రం గుట్టు చప్పుడు కాకుండా ఆ గ్రహానికి వీసా(?) సంపాదించి అక్కడకెళ్ళి బ్రతకడం మొదలెడతారు. నెమ్మదిగా ఆ జనాభా పెరిగి పోతుంది. అక్కడ జీవించే భూగ్రహ జీవులు అక్కడ వాళ్ళకు భూమి ఎంత గొప్పదో వివరిస్తారు. ఈ కొత్త గ్రహంలో ఏముంది, అంతా Trash అని కొట్టేస్తారు. కానీ ఆ గ్రహాన్ని వదిలి రారు.

అక్కడ భూగ్రహ సంఘాలూ, రెండేళ్ళకు ఒకసారి కన్వెన్షన్లూ, ఆ సంఘాల ప్రెసిడెంటు పదవులకు పోటీలూ, మళ్ళీ అందులో రాజకీయాలు జరిగాయని ఆ గ్రహ పరిధిలోని కోర్టులు, దానికి భూమి మీద నివసించే జనాలు గగ్గోలు (భూగ్రహ పరువు తీస్తున్నారని)!

ఆ కొత్త గ్రహం మీద పుట్టే భూలోక వాసుల పిల్లలకు భూమి మీద చలామణిలో ఉన్న ఏదో ఒక భాష నేర్పడానికి బళ్ళూ (..ఎవరినీ ఉద్దేశించి వ్రాసింది కాదండీ బాబూ, కేవలం ఒక ఆలోచన అంతే), భూసంతతికి చెందిన వాళ్ళూ అక్కడ మంచి స్థానాల్లో ఉండడం మూలాన అక్కడ లోకల్ గొడవలూ, ఆ గ్రహానికీ, ఈ గ్రహానికి గోడలు కట్టేస్తాం అనేవాళ్ళూ బయలుదేరుతారు.

ఇక ఇక్కడ కొంతమంది స్వామీజీలు బయలుదేరుతారు. అసలు ఆ గ్రహ ప్రస్తావన మన పురాణాల్లో/బైబిల్లో/మరియు ఇతర మత గ్రంధాల్లోనూ ఉంది, బోడి ఇప్పుడు శాస్త్రజులు కనుక్కోవడం ఏంది, మనకే ముందు తెలుసు అని మొదలెడతారు. ఇదిగో ఫలానా పురాణం లో ఫలాన లైను

మీనింగ్ ఈ గ్రహమే అని నమ్మ బలుకుతారు. విన్నోళ్ళు సూపర్ కదా మన వాళ్ళకు అన్నీ తెల్సండీ అనుకొంటారు. దానికి వత్తాసు పలికే జనాభా పెరిగి పోతుంది. అవకాశమున్న వాళ్ళు అక్కడికి ఎగిరిపోతారు. లేని వాళ్ళు అందని ద్రాక్ష పుల్లన అనే చందాన భూమే బెటర్ అని వాదిస్తారు.

ఈ భాగ్యానికి మరో గ్రహం మనకు తెలీకపోవడమే బెటర్ కదా ! ఉన్న ఏడుపులు చాలవన్నట్లు మళ్ళీ కొత్త ఏడుపులెందుకు?

– ః స్వస్తి ః –



# ఎఫ్రీడే మామ్మ (కథ)

రచన: సునీల్ దొడ్డపనేని

నిన్నే రిజైన్ చేసేశానండి. ఏ రాతకోతలూ లేవు, నోటీసు పీరియడ్లు అంతకన్నా లేవు. బయట ఉన్న నా అవాయ్ చెప్పులు ఏసుకుని చకచకా నడుచుకుంటూ వచ్చేసాను.

ఇంతకూ యజమాని ఎవరనుకున్నారూ? నా కన్న కూతురు కవిత. గడిచిన ఏడేళ్లుగా నాకు వాళ్ళు ఇచ్చే ప్రేమే నా జీతం అనుకుని మురిసిపోయాను. కానీ నిన్న అర్థమైంది.. ఈ కాలం పిల్లల దృష్టిలో నా ఏడేళ్ల చాకిరీ కన్నా, ఒక ఖరీదైన వీడియో గేము ముఖ్యం అని!

నా పేరు శాంతమ్మ. వయసు అరవై ఆరు. వైజాగ్‌లో రిటైర్డ్ టీచర్‌ని. లోకానికి నేను రిటైర్డ్ టీచర్‌ని కావచ్చు కానీ, మా అమ్మాయి ఇంట్లో మాత్రం నేను 24 గంటల వంటమనిషిని, ఊడ్చేదాన్ని, కడిగేదాన్ని, ఆఖరికి నా మనవళ్లు చింటూ (10), కిట్టు (8) లకి ఫుల్ టైమ్ నానిని. వాళ్లకి ఏ కట్టొచ్చినా, గట్టొచ్చినా... ఆఖరికి కర్చీఫ్ ఎక్కడుందో తెలియకపోయినా 'అమ్మమ్మోయ్.. అమ్మమ్మోయ్..' అని నా నెత్తినెక్కి కూర్చోవాల్సిందే! నా ప్రపంచమే వాళ్ళనుకున్నా, కానీ ఆ ప్రపంచాన్ని మోస్తున్న నాకు మిగిలింది మాత్రం ఒళ్లు హూనమైపోయిన నడుము నొప్పి, జివ్వుమని లాగుతున్న తలనొప్పి!

మా అమ్మాయి కవిత, అల్లుడు శీను ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో బిజీ. "అమ్మ.. బయట వాళ్ళని నమ్మలేం, నువ్వుంటేనే మాకు ధీమా" అని బతిమిలాడితే చంకన వేసుకున్నాను. వాళ్ళు పడకుండా ఉండటానికి నేను వెన్నుముకనయ్యాను.

నేను కవిత వాళ్ళతో కలిసి ఉండనండి. ఈ రొద పెరిగిపోయిన సిటీకి ఆమడ దూరంలో, అప్పుడెప్పుడో పచ్చని పొలాల మధ్య కట్టుకున్న మా పెంకుటిల్లు ఒకటుంది. అది ఊరికే రాలేదు బాబూ, నేనూ, నా భర్త సూరిబాబు గారు ఇద్దరం టీచర్ ఉద్యోగాలు చేస్తూ, పొదుపు చేసి, ఒక్కో ఇటుకని పేర్చి కట్టుకున్న మా కలల సౌధం. ఆయన పోయాక, "ఒంటరిగా ఆ ఇంట్లో ఏం చేస్తావు శాంతమ్మ ? కవిత వాళ్ళ దగ్గరికి వెళ్ళిపో" అని అందరూ అన్నారు. కానీ ఆ ఇంటి గోడల మీద ఆయన రాసిన లెక్కలున్నాయి, దొడ్లో ఆయన నాటిన జామ చెట్టు ఉంది. రాత్రిపూట ఆ నిశ్శబ్దంలో గాలికి కొట్టుకునే తలుపు చప్పుడులో కూడా ఆయన పిలుపు వినిపిస్తుంది. ఆ ఇంట్లో అడుగుపెడితే ఆయన నా పక్కనే ఉన్నట్టు అనిపిస్తుంది. అందుకే ఆ జ్ఞాపకాల్ని వదులుకోలేక, రోజూ తెల్లవారుజామునే కవిత వాళ్ళ ఇంటికి యాకయ్య ఆటోలో వెళ్ళి, రాత్రికి మళ్ళీ నా గూటికి నేను వచ్చేస్తుంటాను. ఆ ఏడేళ్లలో ఒక్క రోజు కూడా నా అలసటని నేను పట్టించుకోలేదు.

నా రోజు తెల్లవారుజామున అయిదున్నరకే మొదలవుతుంది. ఆటో కట్టుకుని వాళ్ళ ఇంటికి వెళ్ళడం, పిల్లలకి నచ్చిన టిఫిన్ చెయ్యడం, చింటూకి లెక్కలు చెప్పడం, స్కూల్ కి రెడీ చేయడం.. ఇదీ నా వరస. వాళ్ళు ఆఫీసులకి వెళ్ళాక ఇల్లంతా తుడవడం, కుప్పలు తెప్పలుగా

ఉన్న బట్టలు ఉతకడం నా వంతే. నేను "ఆకుకూరలు తిను", "హోం వర్క్ చెయ్" అని చెప్పే స్ట్రిక్ట్ మామ్మని.

కానీ శీను వాళ్లమ్మ భారతి ఉంది చూడండి. ఆవిడ సిటీలో ఏసీ కారులో తిరుగుతూ ఉంటుంది. సంవత్సరానికి రెండు సార్లు గెస్ట్ లా వస్తుంది. నీట్‌గా గోళ్ల రంగు వేసుకుని, పట్టుచీర కట్టుకుని వస్తుంది. ఆవిడకి పిల్లలకి జ్వరం వస్తే రాత్రంతా మేలుకోవడం అంటే ఏంటో తెలియదు, ఇల్లు తుడవడం అంటే ఏంటో తెలియదు. ఆవిడ మాత్రం 'స్వీట్ మామ్మ '.

నిన్న చింటూ గాడి పదో పుట్టినరోజు. నా దగ్గర ఉన్న వాడి చిన్నప్పటి నుంచి తీసిన ముచ్చటైన ఫోటోలన్నీ ఒకచోట చేర్చి, ఒక్కో ఫోటో వెనుక వాడు చేసిన అల్లరిని, నా జ్ఞాపకాల్ని రాసి ఒక పెద్ద పుస్తకంలా తయారు చేశానండి. వాడికి ఇష్టమని వనిల్లా కేక్ కూడా సొంతంగా ఇంట్లోనే చేశాను. నా చేతులు నొప్పులు పుట్టినా, వాడు తృప్తిగా తింటాడని మురిసిపోయాను. పార్టీ కోసం పొద్దున్నే వెళ్ళి ఇల్లంతా తళతళా మెరిసేలా శుభ్రం చేశాను.

సాయంత్రం నాలుగు గంటలకి భారతి గారు దిగారు. ఖరీదైన సెంటు వాసన కొడుతూ "చింటూ.. కిట్టు.." అని పిలిచింది. అంతే, పిల్లలు నా కేక్ వదిలేసి ఆవిడ మీద పడ్డారు. ఆవిడ ఏదో చేత్తో చేసి తెచ్చిందనుకున్నారా? లేదు.. పెద్ద షాపు నుంచి రెండు లేటెస్ట్ వీడియో గేమ్లు పట్టుకొచ్చింది.

"మీకు ఏం ఇష్టమో నాకు తెలియదు నాన్నా, అందుకే ఇవి తెచ్చేశాను. ఈ రోజు నా రూల్స్.. ఎంతసేపైనా గేమ్స్ ఆడుకోండి!" అంది. ఇంకేముంది.. పిల్లలు కళ్ళప్పగించి ఆ స్క్రీన్ల లోకి వెళ్ళిపోయారు. మా అమ్మాయి, అల్లుడు అయితే "అత్తయ్యా.. మీరు ఎంత గొప్పవారో! పిల్లల్ని ఎంత బాగా చూసుకుంటారో!" అంటూ మెచ్చుకుంటున్నారు.

నేను తయారు చేసిన ఫోటో ఆల్బం పట్టుకుని తెల్ల మొహం వేసుకుని నిలబడ్డాను. మెల్లగా వెళ్ళి "చింటూ.. ఇదిగో నీ కోసం అమ్మమ్మ చేసిన ఫోటో ఆల్బం" అంటే, వాడు కనీసం తల కూడా తిప్పకుండా "అబ్బా.. అమ్మమ్మా! అది ఇప్పుడెందుకు? ఆ పాత ఫోటోలు చూసి ఏం చేస్తాం.. ఇలాంటివి ఏవైనా కొనివ్వచ్చుగా!" అన్నాడు. ఆ మాట వినగానే నా గుండె చెరువైపోయింది బాబూ. ఆ ఆల్బమ్ తయారు చేయడానికి నేను పాత పెట్టెలన్నీ వెతికి ఫోటోలు ఏరి, నా చేతులు నొప్పులు పుట్టినా ఒక్కో ఫోటో వెనుక వాడు చేసిన అల్లరి జ్ఞాపకాలన్నీ రాశానండి. అవన్నీ చూసి వాడు మురిసిపోతాడని ఆశపడ్డానండి.

నా కూతురైనా నన్ను వెనకేసుకొస్తుందని ఆశగా చూశాను. కానీ కవిత నవ్వుతూ "పోన్లే మమ్మీ.. వాడు పిల్లాడు కదా. అత్తయ్య గారు 'ఫన్ మామ్మ', నువ్వేమో 'ఎవ్రీడే మామ్మ'. నీ పని నీదే, ఆవిడ సరదా ఆవిడదే.. దీన్ని పెద్ద ఇష్యూ చేయకు" అంది.

'ఎఫ్రీడే మామ్మ'.. అంటే పాత చెప్పుల జత లాంటిదన్నమాట. అవసరానికి ఉండాలి కానీ, ఉన్నట్టు గుర్తుండక్కర్లేదు. నా మనసు పొరల్లో చిన్న ప్రకంపనం. గిన్నెలు తోమి తోమి పగిలిన నా చేతుల వైపు చూసుకున్నాను. కూల్ డ్రింక్ గ్లాసు పట్టుకుని సోఫాలో కూర్చున్న నా కూతురిని చూశాను. నేను కేక్ కోసి, ప్లేట్ల లో తెస్తానని ఎదురు చూస్తోంది.

నేను చేతులు కడుక్కుని, చీర కొంగుతో అలసటను తుడుచుకుని... "కవితా.. నేను వెళ్తున్నాను" అన్నాను స్థిరంగా. "ఏంటే మమ్మీ? కేక్ తీసుకురా. చింటూకి ఆకలేస్తోంది" అంది తల ఊపుతూ.

"లేదు.. నేటి నుండి నాకు సెలవు."

భారతి గారు మధ్యలో దూరి "ఏంటి వదిన... గోరంత దానికి కొండంత హడావిడి చేస్తున్నారు? ముసలి వయసులో చాదస్తం ఏమైనా వచ్చిందేంటి?" అంది వెటకారంగా.

నేను ఆవిడ వైపు తిరిగి "వదిన గారు.. మీరు 'సరదా మామ్మ' కదా! మరి కాసేపట్లో పిల్లలకి ఆ స్క్రీన్ల వల్ల తలనొప్పి వచ్చి అల్లరి మొదలుపెడతారు, ఆ 'సరదా' మీరు చూడండి. పైన మూడు బకెట్ల బట్టలు ఉన్నాయి, అవి కూడా ఆరేస్తే మీకు ఆ 'ఎఫ్రీడే' అనుభవం ఏంటో తెలుస్తుంది" అని చెప్పేశాను. ఆవిడ మొహం మాడిపోయింది.

బయటకి వచ్చేస్తుంటే కవిత పరిగెత్తుకు వచ్చింది. "మమ్మీ.. రేపు పొద్దున్న పిల్లల్ని స్కూల్ కి ఎవరు తయారు చేస్తారు? నాకు మీటింగ్ ఉంది! మమ్మల్ని ఇలా ఇబ్బంది పెట్టకు" అని అంది.

"నాకు తెలియదు కవితా.. మీ ఫన్ మామ్మని అడుగు. లేదా ఏడేళ్లుగా ఫ్రీగా వస్తున్న సాయాన్ని ఇకపై డబ్బులిచ్చి కొనుక్కో" అని వడి వడిగా నడక సాగించాను.

ఫోన్ మోగుతూనే ఉంది. "నువ్వు చాలా సెల్ఫిష్ మమ్మీ" అని మెసేజ్ లు వస్తున్నాయి. నేను మాత్రం ప్రశాంతంగా ఉన్నాను. ఈ రోజు ఎనిమిది గంటలకి నిద్ర లేచాను. జామ చెట్టు పక్కనున్న గట్టు పై కూర్చుని తీరిగ్గా కాఫీ తాగాను. చెట్టుపై నుండి వినిపిస్తున్న కిల కిల రావాలు వింటూ నా జీవితంలో తరువాతి అంకానికి శ్రీకారం చుట్టాను.

మన కుటుంబాలకి 'ప్రేమ'కి, 'ఉచిత చాకిరీ'కి తేడా తెలియడం లేదు బాబూ. మనం అరిగిపోయి ఆవిరైపోయేదాకా సేవ చేయడమే ప్రేమ అనుకుంటున్నారు. నా మనవళ్లని నేను ప్రేమిస్తాను, వాళ్ళ కోసం ప్రాణాలైనా ఇస్తాను. కానీ వాళ్ళ ఇంట్లో ఒక 'పనిముట్టు' లా మాత్రం ఉండను. వాళ్ళకి ఆ 'ఎఫ్రీడే మామ్మ' కావాలంటే, ఆ పని వెనుక ఉన్న మనిషిని గౌరవించడం నేర్చుకోవాలి. అప్పటిదాకా.. ఈ 'ఎఫ్రీడే మామ్మ' గారు అలా సెలవలకి వెళ్ళి వస్తారు!

--శుభం--

# *Platinum Sponsor*



# విధి (కథ)

**మూలం: హీబ్రు జానపద కథ**

**సేకరణ: సునీల్ దొడ్డపనేని**

విక్రమార్క మహారాజు ఆస్థానంలోకి ఒక సేవకుడు రొప్పుతూ పరుగెత్తుకు వచ్చాడు. "ప్రభూ! దయచేసి మీ దగ్గరున్న వేగవంతమైన గుర్రాన్ని నాకు ఒక్కసారి ఇప్పించండి!" అని వేడుకున్నాడు. "సూర్యాస్తమయం అయ్యేలోపు ఇక్కడికి పది యోజనాల దూరంలో, దక్షిణాన ఉన్న ఊరికి నేను చేరుకోవాలి!" అన్నాడు.

రాజు ఆ సేవకుడి వణికిపోతున్న చేతుల్ని చూసి, "ఎందుకింత తొందర?" అని అడిగాడు. "నేను ఇప్పుడే సంత నుండి వస్తున్నాను" అని ఆ సేవకుడు తడబడుతూ, నీడల వైపు భయంగా చూస్తూ చెప్పాడు. "అక్కడ జనసమూహంలో నాకు యముడు కనిపించాడు! ఆయన నేరుగా నా వైపే చూస్తూ, నన్ను బెదిరిస్తున్నట్టుగా ఒక సైగ చేశాడు. నేను ఇక్కడి నుంచి పారిపోవాలి! ఇప్పుడు నేను దక్షిణానికి గుర్రం మీద వెళ్తే, చీకటి పడేలోపు పక్క ఊరికి చేరుకుని నా ప్రాణాలు కాపాడుకోగలను."

విక్రమార్క మహారాజు నెమ్మదిగా తల ఊపి, "సరే, నా మేలుజాతి గుర్రాన్ని తీసుకెళ్లు. దైవం నీకు తోడుగా ఉండుగాక," అని సెలవిచ్చారు. ఆ సేవకుడు గుర్రం మీద ధూళి మేఘాలను రేపుతూ మెరుపు వేగంతో వెళ్ళిపోయాడు.

అప్పుడు విక్రమార్క రాజు స్వయంగా సంతలోకి నడుచుకుంటూ వెళ్ళాడు. ఆ సేవకుడు చెప్పిన ఆ అదృశ్య ఆకారాన్ని కనుగొనడానికి ఆయనకు ఎంతో సమయం పట్టలేదు. నల్లటి అంగీ ధరించి, మసాలా దినుసులు బళ్ల వద్ద ఒక నిగూఢ రూపం నిలబడి ఉంది. రాజు భయం లేకుండా ఆ రూపాన్ని సమీపించాడు. "యమధర్మరాజా! నా సేవకుడిని ఎందుకు భయపెట్టావు?" అని అడిగాడు. "ఈ ఉదయం వాడిని చూసి ఎందుకు బెదిరిస్తున్నట్టుగా సైగ చేశావు?"

యముడు ఆ రాజు వైపు చూశాడు. ఆ గొంతు ఎండిపోయిన ఆకుల రాపిడిలా వినిపించింది. "ఓ జ్ఞానియైన రాజా! నేను వాడిని బెదిరిస్తూ సైగ చేయలేదు," అని సమాధానమిచ్చాడు. "అది నా ఆశ్చర్యంతో కూడిన సైగ."

"ఆశ్చర్యమా?" అని అడిగారు విక్రమార్కుడు.

"అవును," అని యముడు తల ఊపాడు. "ఈ ఉదయం వాడిని ఇక్కడ నగరంలో చూసి నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే, ఈ రాత్రికి ఇక్కడికి పది యోజనాల దూరంలో దక్షిణాన ఉన్న ఊరిలో వాడి ప్రాణాలు తీయాలని రాసి పెట్టి ఉంది. మరి వాడు ఇక్కడ ఎలా ఉన్నాడా అని ఆశ్చర్యపోయాను."

# దృష్టికోణం (కథానిక)

రచన: ఓ అజ్ఞాత రచయిత

సేకరణ: సునీల్ దొడ్డపనేని

ఒక రెండో తరగతి లెక్కల టీచరు పిల్లలకు పాఠం చెబుతోంది.

"ఒరేయ్ రామూ, నేను నీకు ఒక ఆపిల్, కాసేపాగి మరో ఆపిల్, ఇంకాసేపటి తరువాత మరోఆపిల్ ఇచ్చాననుకో నీదగ్గర అప్పుడు మొత్తం ఎన్ని ఆపిల్స్ ఉంటాయి?"

రాము బాగా ఆలోచించి, వేళ్ళతో లెక్కలు కట్టి అన్నాడు.

"నాలుగు"

టీచర్ కొంచం నిరాశ చెందింది. మూడు అని ఉంటే ఎంత బావుండేది అనుకొంది..

అయితే ఆ నిరాశను పైకి చూపక చిన్నగా నవ్వుతూ

"... బానే లెక్క కట్టావు కానీ... మరోసారి ఆలోచించి చూడు! ప్రశ్న శ్రద్ధగా విన్నావనుకో సమాధానం తేలిగ్గా తెలిసిపోతుంది. ఏ?.

నేను నీకు ఒక ఆపిల్, కాసేపాగి మరో ఆపిల్, ఇంకాసేపటి తరువాత మరో ఆపిల్ ఇచ్చాననుకో నీ దగ్గర అప్పుడు మొత్తం ఎన్ని ఆపిల్స్ ఉంటాయి?"

ఈ సారి చాలా నమ్మకంగా ఉంది టీచర్, సరైన జవాబొస్తుందని!

రాము టీచర్ మొహంలో కనబడ్డ నిరాశను గమనించాడు.

ఈ సారి తప్పుచెయ్యకూడదని చాలా శ్రద్ధగా విన్నాడు ప్రశ్నను. వినగానే మళ్ళీ వేళ్ళు విప్పి లెక్క కట్టాడు!

సమాధానం వచ్చింది...

ఒకింత బెరుగ్గా, కాసింత భయంగా అన్నాడు...

....నాలుగు టీచర్"

ఈసారి టీచర్ మొహంలో నిరాశ, బాద స్పష్టంగా కనిపించాయి. కానీ అంతలోనే తేరుకొని ఒక్క క్షణం ఆలోచించింది.

ఈ పిల్లాడికి అర్ధమయ్యేలా ఎలా చెప్పడం?

ఆమెకు తటాలున ఒక ఆలోచన వచ్చింది.... రాముకు అరటి పళ్ళంటే ఇష్టం... ఈ సారి ప్రశ్న మార్చింది.

"సరే.. అదలా వదిలెయ్. ఇది చెప్పు..

నేను నీకు ఒక అరటిపండు, కాసేపాగి మరో అరటిపండూ, ఇంకాసేపటి తరువాత

మరోఅరటిపండూ ఇచ్చాననుకో నీ దగ్గర అప్పుడు మొత్తం ఎన్ని అరటిపళ్లు ఉంటాయి?"

రాము ఈసారి మరింత శ్రద్ధగా లెక్క కట్టాడు....

జాగ్రత్తగా లెక్క కట్టి చెప్పాడు.

"మూడు టీచర్"

టీచర్ మొహం ఆనందంతో వెలిగింది. తన అప్రోచ్ కు తనకు కించిత్ గర్వంగానూ అనిపించింది!

వెరీ గుడ్! చూశావా శ్రద్ధగా వింటే ఎంత చక్కగా చెప్పావో... ఇప్పుడు అదే ప్రశ్న ఆపిల్ పళ్ల లోకి మార్చి

అడుగుతా... సమాధానం చెప్పు!

నేను నీకు ఒక ఆపిల్, కాసేపాగి మరో ఆపిల్, ఇంకాసేపటి తరువాత మరోఆపిల్ ఇచ్చాననుకో నీదగ్గర అప్పుడు మొత్తం ఎన్ని ఆపిల్స్ ఉంటాయి?"

ఈసారి టీచర్ కు ఎలాటి అనుమానాలూ లేవు.

రాము మళ్ళీ లెక్క కట్టి... ఈసారి జంకుతూ చెప్పాడు

"నాలుగు"

అంటే టీచర్ మొహంలో విసుగూ, కోపం చెలియలి కట్టను దాటేశాయి...

" ఏరా అరటిపళ్ళు మూడూ, ఆపిల్స్ అయితే నాలుగు ఎలా ఉంటాయిరా వెధవా... ఆటలుగా ఉందా? వీపు చీరేస్తా వెధవాయ్.....ఎలాగో చెప్పు"

రాము బిక్క చచ్చిపోయి...

"మీరు ఇచ్చే మూడు ఆపిల్స్, సంచిలో మా అమ్మ ఇచ్చిన మరో ఆపిల్ మొత్తం నాలుగు ఉంటాయి టీచర్" టీచర్ స్థాణువయ్యింది ఆ సమాధానం విని!

**నీతిః**

ఎప్పుడైనా ఎదుటి వారి నుండి మనం ఆశిస్తున్న సరైన సమాధానం రానంత మాత్రాన, వాళ్ళు ఖచ్చితంగా తప్పు చెబుతున్నారని ఒక ముగింపు నిర్ణయానికి ఎప్పుడూ రావద్దండి. ఆ సమాధానం వెనుక మీకు అర్థంకాని, తెలీని మరో కోణం ఉండవచ్చు.

ఎదుటి వారి దృష్టికోణాన్ని ఎప్పుడూ గౌరవించి, అభినందించగలిగి ఉన్నపుడే ఉన్నతి సాధ్యపడుతుంది. మన జీవితాల్లో చాలా సార్లు మనం చేసే తప్పు ఇదే! మన దృష్టి కోణాన్ని ఎదుటి వారిపై రుద్దటం, సమాధానం మనకు అనుకూలమవనప్పుడు ఎక్కడ తప్పు జరిగిందో అర్థంకాక జుట్టు పీక్కోవడం. ఈ సారి ఎదుటి వారి సమాధానం మనం ఆశించనిదైనప్పుడు... మన్ననతో అర్థం తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం!

# Gold Sponsors



# తెలుగుబడి

## నెబ్రాస్కా తెలుగు సమితి (TSN)

### ఒమహా, నెబ్రాస్కా

"భాష బ్రతికితే – సంస్కృతి బ్రతుకుతుంది, సంస్కృతి బ్రతికితే – మన గుర్తింపు బ్రతుకుతుంది"

**రచన: వీణమాధురి ద్రోణాదుల**




## ప్రస్తావన

తెలుగు – అమృతం లాంటి భాష. ఆ భాషలో అమ్మ పిలుపు వింటే గుండె పులకిస్తుంది, నాన్న కథ వింటే కళ్ళు మెరుస్తాయి. కానీ కాలం గడిచేకొద్దీ, దేశాల సరిహద్దులు దాటేకొద్దీ, ఈ అమృతభాష మన పిల్లల నాలుకల మీద నుండి జారిపోతుందేమోనని ప్రతి తెలుగు తల్లిదండ్రి హృదయంలో ఒక భయం, ఒక బాధ ఉంటుంది. ప్రపంచం ఎంత పెద్దదైనా, మన మూలాలు మాత్రం మరచిపోకూడదు. ఇది కేవలం ఒక తరగతి గది కాదు ఇది విదేశాల్లో తెలుగు భాషను, సంస్కృతిని సజీవంగా ఉంచే ఒక పవిత్ర యజ్ఞం. TSN బృందం అంకితభావంతో ఈ యజ్ఞాన్ని ఒక విప్లవాత్మక ఉద్యమంగా మలిచింది.

## TSN దార్శనికత

నెబ్రాస్కా తెలుగు సమితి తెలుగు భాషాభివృద్ధికి, సాంస్కృతిక పరిరక్షణకు అనుపమేయమైన కృషి చేస్తోంది. TSN బృందం ఒక కుటుంబంలా పనిచేస్తూ, తెలుగుబడి నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, విద్యార్థుల నమోదు, వనరుల సేకరణ వంటి ప్రతి అంశంలో అంకితభావంతో పనిచేస్తోంది. TSN బృందం యొక్క సామూహిక శక్తి, సంకల్పబలం తెలుగుబడిని ఒక అద్భుతమైన విజయగాథగా మార్చాయి.

## తెలుగుబడి – ఒక అద్భుత ప్రయాణం

తెలుగుబడి ప్రతి శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిర్వహించబడుతుంది. ఈ సంవత్సరం 61 మంది విద్యార్థులు తెలుగుబడిలో నమోదు చేసుకోవడం ఒక చారిత్రాత్మక విజయం. అమెరికాలోని హృదయ భూమి నెబ్రాస్కాలో ఇంతమంది తెలుగు పిల్లలు ప్రతి వారం తెలుగు నేర్చుకోవడానికి ఉత్సాహంగా వస్తున్నారంటే, అది ఈ సమితి యొక్క అసాధారణమైన అంకితభావానికి, TSN బృందం యొక్క నిర్విరామ కృషికి నిదర్శనం. తెలుగుబడి గడప దాటిన ప్రతి బిడ్డ హృదయంలో తెలుగు భాష పట్ల ప్రేమ విత్తనాలు నాటబడుతున్నాయి.

## సమగ్ర బోధనా విధానం

తెలుగుబడిలో బోధన కేవలం అక్షరాలు, పదాలకే పరిమితం కాదు ఇది ఒక సమగ్ర సాంస్కృతిక విద్య. విద్యార్థులకు తెలుగు అక్షరమాల, పదజాలం, వాక్య నిర్మాణం, చదవడం, రాయడం నేర్పిస్తారు. భాషా బోధనతో పాటు, సంక్రాంతి, ఉగాది, బతుకమ్మ, దసరా, దీపావళి వంటి పండుగల ప్రాముఖ్యతను, వాటి వెనుక ఉన్న పురాణ కథలను, ఆచారాలను వివరిస్తారు. తెలుగు సంస్కృతి, కళలు, సంగీతం, నృత్యం, సాంప్రదాయాలు మరియు సంస్కృతి గురించి లోతైన అవగాహన కల్పిస్తారు. ఈ విద్యా విధానం వల్ల పిల్లలు భాషనే కాకుండా, తెలుగు నాగరికత యొక్క గొప్పతనాన్ని అర్థం చేసుకుంటారు.

## సమర్పణాభావం గల ఉపాధ్యాయ బృందం

తెలుగుబడి విజయం వెనుక ఒక అసాధారణమైన ఉపాధ్యాయ బృందం ఉంది. ప్రధానోపాధ్యాయులు శ్రీ వేణు మురకొండ గారి సమర్థవంతమైన నిర్వహణలో, అంకితభావం గల ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారు. మన గొప్ప ఉపాధ్యాయ బృందం ఉమామహేశ్వరరావు, రాజా, పవిత్ర, దివ్య, సుధీర్, స్వప్న, వీణమాధురి, సువర్ణ,

మౌనిక, సుహిత మరియు తనూజ గార్లు. ఈ ఉపాధ్యాయులందరూ తమ వృత్తిపరమైన బాధ్యతలతో పాటు, ప్రతి శనివారం తమ విలువైన సమయాన్ని స్వచ్ఛందంగా అందిస్తూ, నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. ఈ ఉపాధ్యాయుల త్యాగం, ఓర్పు, ప్రేమ – ఇవి తెలుగుబడికి ప్రాణం పోస్తున్నాయి.

## తెలుగుబడి ఎందుకు అవసరం?

ఒక భాష అంతరించిపోతే, దానితో పాటు ఒక సంపూర్ణ సంస్కృతి, చరిత్ర, జ్ఞానం కూడా అంతరించిపోతాయి. అమెరికాలో పుట్టి పెరుగుతున్న మన తెలుగు పిల్లలకు ఆంగ్లం సహజంగా వచ్చినా, తెలుగు నేర్చుకోకపోతే వారు తమ మూలాలను కోల్పోతారు. తెలుగుబడి ద్వారా పిల్లలు తమ తాతయ్యలు, అమ్మమ్మలు, బంధువులతో హృదయపూర్వకంగా తెలుగులో మాట్లాడగలుగుతారు. తెలుగు సాహిత్యం, సినిమాలు, పాటలు, కథలను ఆస్వాదించగలుగుతారు. ఇది వారి సాంస్కృతిక గుర్తింపును బలపరుస్తుంది, ద్విభాషా నైపుణ్యాలను పెంచుతుంది మరియు వారిలో ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది.

## సమాజ నిర్మాణంలో TSN బృందం పాత్ర

తెలుగుబడి కేవలం ఒక పాఠశాల మాత్రమే కాదు ఇది ఒమహాలోని తెలుగు కుటుంబాల హృదయ స్పందన. TSN బృందం ప్రతి శనివారం తల్లిదండ్రులను, పిల్లలను, ఉపాధ్యాయులను ఒకచోట చేర్చి, తెలుగులో మాట్లాడుకునే, నవ్వుకునే, సంస్కృతిని పంచుకునే ఒక అపూర్వమైన వేదికను నిర్మిస్తోంది. సాంస్కృతిక కార్యక్రమాలలో పిల్లలు తెలుగు పాటలు, నృత్యాలు, నాటికలు ప్రదర్శిస్తూ, తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనంద బాష్పాలు తెప్పిస్తున్నారు.

## ముగింపు

నెబ్రాస్కా తెలుగు సమితి నిర్వహిస్తున్న తెలుగుబడి, ప్రధానోపాధ్యాయులు శ్రీ వేణు మురకొండ గారి సమర్థ నిర్వహణలో, పది మంది అంకితభావం గల ఉపాధ్యాయుల నిస్వార్థ సేవ, ఒమహాలోని తెలుగు సమాజానికి ఒక వెలకట్టలేని సంపద. 61 మంది విద్యార్థులతో వెలిగిపోతున్న ఈ తెలుగుబడి, రాబోయే తరాలకు తెలుగు వారసత్వాన్ని అందించే ఒక దీపస్తంభం. తెలుగుబడి అనేది కేవలం తరగతి గది కాదు అది మన తెలుగు తల్లి ఒడి. TSN బృందం వేస్తున్న ఈ బంగారు బాట మీద నడిచి, మన భాషను, సంస్కృతిని, సంప్రదాయాలను విదేశాల్లో కూడా చిరకాలం సజీవంగా ఉంచుదాం!

# Gold Sponsors

KONARK
GROCERY - MEAT - PRODUCE - EATERY

KONARK
GROCERY - MEAT - PRODUCE - EATERY

# చెట్టు నేర్పిన కథ



రచన: స్వప్న అధగిరి

ఒక నాడు ఓ పైన్ చెట్టు పక్కనే ఉన్న చెర్రీ చెట్టును ఇలా అడిగిందట.

“ఏంటి నువ్వు అస్తమానం మారుతూ ఉంటావు? ఓసారి ఆకులు ఉంటాయి, అప్పుడే వాడిపోతాయి. ఒకసారి పువ్వు అంటావు, మళ్లీ పండు అంటావు. అబ్బా నీకు అసలు నిలకడే లేదు ఏంటో!”

అంటూ వెటకారంగా వెక్కిరిస్తూ తనను తాను చూసుకుని గర్వంతో పొంగిపోతుంది.

అప్పుడు ఆ చెర్రీ చెట్టు పక్కున నవ్వి ఇలా అంటుంది...

“ప్రకృతి, ఋతువులు, వాటితో వచ్చే మార్పులు – కాలానికి తగట్టుగా మనలో మార్పులు చేసుకోవడం ఎంతో ముఖ్యము. అదే కదా జీవన విధానం, అయినా ఒకే తీరుగ నిలిచిపోయిన నీకు ఇవన్నీ ఏమి తెలుస్తాయి లే,” అంటూ ఘాటుగా సమాధానం ఇస్తుంది.

“అబ్బో పెద్ద బడాయి! నీకే అన్నీ తెలిసినట్టు. నువ్వు ఇలానే పొంగిపో... ఒకరోజు ఏకంగా నిన్ను కోసుకుని తీసుకెళ్లిపోతారు,” అని చెప్పకనే చెప్పినట్టు హెచ్చరిస్తుంది.

దానికి చెర్రీ చెట్టు కాస్త ఆలోచనలో పడి ఇలా వివరిస్తుంది –

“నేను ప్రకృతి కోసమే పుట్టాను. ఆ ప్రకృతిలో ఉండే ప్రతి జీవరాశికి ఉపయోగపడటం నా ధర్మం. నేను ఇచ్చే నీడలో తల దాచుకుని విశ్రాంతి తీసుకుంటారు. నా పువ్వులు, పండ్లను ఆస్వాదిస్తారు. నా చుట్టూ ఎప్పుడూ ఒక ఆనందకరమైన వాతావరణం ఉంటుంది. నేను చిగురించే కాలం కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తారు. ఎన్నో రకాల పక్షులకు నేను గూడు, ఆహారం అందిస్తాను.” ఆ మాటలు విన్న పైన్ చెట్టు కొద్దిగా చింతలో పడింది. పైకి గర్వంగా మాట్లాడినా లోపల మాత్రం చెర్రీ చెట్టును చూసి అసూయపడేది.

అంతలో చలికాలం రానే వచ్చింది. ఒక రోజు పెద్ద పెద్ద వాహనాలతో నలుగురు మనుషులు వచ్చి ఆ చెర్రీ చెట్టును కోసుకుని వెళ్లిపోయారు.

ఇన్ని రోజులు కస్సుబుస్సులాడిన పైన్ చెట్టు ఒక్కసారిగా ఒంటరిగా అవ్వడంతో చాలా బాధపడింది.

“ఇటు వైపుగా ఇక ఎవరూ రావు. ఆడుకునే పిల్లలు, చిత్రాలు దిగే జంటలు... ఆ నవ్వులు,

కేరింతలు అన్నీ మాయం అయిపోయాయి. నా దగ్గర గబ్బిలాలు చప్పుడికి నన్ను చూసి దగ్గరికి వచ్చే వారే లేరు,"

అంటూ బాధతో శోకిస్తుంది.

కొత్త కాలానికి వర్షాలు రావడం మొదలయ్యాయి. చెర్రీ చెట్టును తలుచుకుంటూ అది వెళ్లిపోయిన చోటును చూస్తూ ఉండగా అక్కడ మెల్లగా ఒక చిన్న మొక్క పెరుగుతుండటం పైన్ చెట్టు గమనించింది.

"అరే ఇదేంటి... చెర్రీ చెట్టు మళ్లీ వస్తుందా?" అని ఒక క్షణం ఎంతో ఆనందపడింది.

కొంత కాలానికి ఆ చెర్రీ మొక్క పెద్ద చెట్టైంది.

"హమ్మయ్య! మొత్తానికి తిరిగి వచ్చేశావు అనమాట. గట్టోడివే!" అంటూ పైన్ చెట్టు పలకరించింది.

దానికి చెర్రీ చెట్టు

"నేను లేని లోటు బాగా తెలుసుకున్నట్టు ఉన్నావు," అని చిలిపిగా అంటుంది.

"ఇంతకీ ఎలా తిరిగొచ్చావు?" అని పైన్ చెట్టు ఆశ్చర్యంగా అడగగా --

"నా చెట్టు నుంచి రాలే పళ్ళలోని విత్తనాలే మళ్లీ భూమిలో నాటుకుని కొత్త మొక్కగా చిగురించాయి," అంటూ వివరిస్తుంది.

"ఓహో... నాకు ఇప్పుడు అర్థం అయింది నువ్వు చెప్పిన జీవితం చక్రం అంటే ఏమిటో," అంటూ పైన్ చెట్టు తాను ఇక మళ్లీ ఒంటరిగా ఉండదని సర్ది చెప్పుకుని తృప్తి చెందుతుంది.

**ఈ కథలోని నీతి:**


ఈ ప్రకృతిలో ఉన్న జీవరాశుల కాలచక్రాన్ని, జీవన విధానాన్ని, కష్టాలు-సుఖ- దుఃఖాలు-ఆనందాలు, మంచి-చెడు అన్నిటి కలయికను ఎంతో చక్కగా తెలియజేస్తుంది ఈ కథ.

**"ధర్మో రక్షతి రక్షితః!**

# కృత్రిమ మేధస్సు

రచన: స్వప్న అధగిరి

అమ్మ: "ఓరే చిన్నా, నీకోసం బెండకాయ పులుసు చేసాను రా. బెండకాయ తింటే మేధస్సు పెరుగుతుంది." కొడుకు చిన్నా: "ఏంటమ్మా నువ్వు మరి... బెండకాయ, దొండకాయ అంటూ ఉంటావు. అక్కడ సాంకేతిక నిపుణులు ఏవేవో కనిపెడుతున్నారు. మాకు ఇక మనుషులతో పని లేదు, అన్నీ రోబోలు చేస్తాయి అంటున్నారు. అమ్మ: "అబ్బో పెద్ద రోబో అట! ఏది నా చేతి బెండకాయ పులుసు రుచిని ఆ రోబో చేయగలదేమో చెప్పమను." చిన్నా: "అహ్!! ష్.. సరిపోయింది... ఆ AI ని కనిపెట్టిన వాడి అమ్మ కూడా ఇలానే బెండకాయ పెట్టి పెంచిందో ఏమో!"



# Silver Sponsors

bestbrains
LEARNING CENTERS

HELLO INDIA
INDIAN CUISINE

# చెప్పగలవ

రచన: స్వప్న అధగిరి

ఉరుకుల పరుగుల ఈ జీవితంలో
చుట్టూ ఉన్న అందాన్నీ నువ్వు చూడగలవా...
ఒక్కసారిగ ఈ లోకం ఆగిపోమంటే,
నిలకడగా నువ్వు అసలు నిల్చోగలవా..
నీ నిస్సహాయ స్థితి నీకు ఏం నేర్పింది,
మరో మనిషికి నువ్వు సాయం చెయ్యగలవా..
నీ చీకటి రోజులు నీకు ఏం చూపించాయి,
మరొకరికి నువ్వు వెలుగుని ఇవ్వగలవా..
నీ ఆకలి కడుపుని నువ్వు ఎలా నింపుకున్నవో
అదే ఆకలితో అల్లాడే వాడిని నువ్వు చేరగలవా..
నీ వొంటరి తనానికి నువ్వు ఎలా దూరం అయ్యవో
అదే పోరాటంలో ఉన్న ఒకరికి చేయి అందించగలవా..
నీ కష్టాలను ఎదుర్కొని నిలబడిన నువ్వు,
ఎదుటి వానికి స్ఫూర్తిని ఇవ్వగలవా..
సంతోషం అనేది మనతోనే మొదలవుతుందని
నీ మాటల్లో ఈ ప్రపంచానికి చెప్పగలవా..

# Silver Sponsors






# బారసాల (నాటిక)

రచన: మల్లాది రామకృష్ణశాస్త్రి గారు

(సుమారు 45 ఏళ్ళ క్రితం బాల అనే పిల్లల పత్రికలో వ్రాసిన కథ యిది.)

ఒక వూరిలో సుబ్బయ్య, సుబ్బమ్మ అనే దంపతులు వుండేవారు. సుబ్బయ్య ఆ వూరి బడిలో ఉపాధ్యాయుడు. వారికి పెళ్ళయిన 10 సంవత్సరాలకు ఒక అబ్బాయి పుట్టాడు. వారి సంతోషానికి అంతులేదు.

ఆ పిల్లవాడికి బారసాల జరపాలని, ఏమి పేరు పెట్టాలనే విషయాన్ని చర్చించుకుంటున్నారు.

సుబ్బయ్య:- ఒసే సుబ్బీ సుబ్బూ అని గట్టిగా పిలుస్తున్నాడు సుబ్బయ్య.

సుబ్బమ్మ :- ఏమిటా గావు కేకలు? అయినా నన్ను సుబ్బీ అనీ, సుబ్బూ అనీ పిలవద్దని ముద్దుగా శుభా అని పిలవమని మీకు ఎన్ని సార్లు చెప్పాను?

సుబ్బయ్య:- అబ్బబ్బ సరెలేవే ఏదో అలవాటులో పొరపాటు. యిప్పుడు నీ పేరు సంగతి అలా వుంచు. రేపు మన అబ్బాయికి బారసాల చేస్తున్నాము కదా! వాడికి ఏమి పేరు పెడదాము?

సుబ్బమ్మ (కుర్చీలో కూర్చుంటూ) ఆ చెప్పండి ఏమి పేరు పెడదాము?

సుబ్బయ్య :- నేనేమో రామకోటి వ్రాస్తాను కనుక శ్రీరాముడి పేరు పెట్టాలి, మానాన్నగారి పేరు కూడా పెట్టాలి.

సుబ్బమ్మ :- ఆగండాగండి మా అమ్మ పేరు పెట్టక పోతే నేనూరుకోను.

సుబ్బయ్య :- మీ అమ్మ ఆడది అబ్బాయి మొగవాడు పేరెలా పెట్టేది?

సుబ్బమ్మ:- మా అమ్మ పేరు నూకమ్మ, నూకయ్య అని పెట్టి నూకాలూ అని ముద్దుగా పిలుచుకోవచ్చు.

సుబ్బయ్య:- సరేలే. నేను రోజూ భగవద్గీత పారాయణం చేస్తాను కాబట్టి భగవద్గీత అని పేరు పెట్టాలి. ఇంకా మన యిలవేలుపు హనుమంతుడి పేరు కూడా పెట్టాలి.

సుబ్బమ్మ :- భగవద్గీత, రామాయణం, రఘువంశం యివేమీ పేర్లండీ బాబూ!

సుబ్బయ్య :- అల్లా వీల్లేదు పెట్టాల్సిందే. ఇంకా మా బడి విద్యాధికారి పేరు గేబ్రియేల్.. ఆయన పేరు పెడితే నాకు హెడ్ మాష్టర్ గా ప్రమోషనో లేక ఇంక్రిమేంటో దొరుకుతుంది.

సుబ్బమ్మ :- పోయి పోయి ఆ కిరస్తానీ పేరెందుకండీ

సుబ్బయ్య :- ఎక్కువగా మాట్లాడావంటే బెంచి ఎక్కిస్తా జాగ్రత్త... చెప్పానుగా ప్రమోషన్ తప్పక యిస్తాడనీ.

ఇంతలో బయటి నుండి సుబ్బయ్య వేలువిడిచిన మేనత్త లక్ష్మమ్మ వస్తుంది.

లక్షమ్మ :- నాయనా సుబ్బయ్యా పోయిన నెలలో నాకొడుక్కు జ్వరమొస్తే, వాడికి త్వరగా తగ్గిపోతే నీ కొడుక్కు వెంకటేశ్వర స్వామి పేరు పెడతానని మొక్కుకున్నాన్రా.

సుబ్బయ్య :- నీ కొడుక్కు జ్వరమొస్తే మధ్యలో నా కొడుక్కు స్వామి పేరు పెడతానని మొక్కుకోడమేంటీ?

లక్షమ్మ :- తప్పు తప్పు స్వామిని గురించి అలా అనకూడదురా. నీ కొడుక్కు జలుబు చేస్తుంది.

సుబ్బయ్య:--జలుబు చేస్తే పొడుం (నస్యం) పీలుస్తాడులే.

సుబ్బమ్మ: :- లెంప లేసుకుంటూ తప్పు తప్పు స్వామిని అలా అనకూడదు. నీ పేరు పెడతాము తండ్రీ! నా బిడ్డను కాపాడు అంటూ దండం పెడుతుంది.

(లక్ష్మమ్మ నిష్క్రమణం సూరమ్మ ప్రవేశం)

సుబ్బయ్య :- సూరమ్మను చూసి వెటకారంగా ఏమిటి సూరమ్మత్తా నీవు కూడా ఏ దేముడికో దయ్యానికో మొక్కు కొచ్చినట్టుంది.

సూరమ్మ :- ఆ ఏముంది నాయనా! ఇవ్వాళ చస్తే ఒకటి రేపటికి రెండు

సుబ్బయ్య:- (కోపంగా)ఎల్లుండికి మూడు. శుభమా అని నా కొడుక్కు బారసాల చేస్తుంటే నీ చావులేమిటి?

సూరమ్మ:- అనను లేరా. సుబ్బయ్యా ఆయన పేరు పెట్టుకోరా.. నీ కొడుకు ఆయనంతటి వాడవుతాడురా.

సుబ్బయ్య:- ఎవరే ఆయన?

సూరమ్మ :-(సిగ్గుతో మెలికలు తిరుగుతూ) పేరెలా చెప్పనురా

సుబ్బయ్య:- చెప్పకుంటే నేను పెట్టనుపో

సూరమ్మ:- నిన్న రాత్రి కల్లో కూడా కనిపించార్రా

సుబ్బయ్య:- కొంపదీసి బారసాలకు రమ్మన్నావా ఏమిటి?

సూరమ్మ:-- మీ మామయ్యరా.

సుబ్బయ్య :- ఓసి నీ సిగ్గు బొగ్గులుగానూ ! చచ్చినవాడి పేరు చెప్పటానికి ఎంత సేపు చేశావే.

(సూరమ్మ నిష్క్రమణం పకింటి ఆండాలమ్మ ప్రవేశం)

ఆండాలమ్మ :- సుబ్బియా రొంబ సంతోషమా యిరుక్కు

సుబ్బయ్య:- సంతోషానికి యిరుకూ సన్నమూ ఏమిటమ్మా?

ఆండాలమ్మ :- వుంగ పయ్యన్ కు అవరి పేరు వెచ్చికో వుంగ పయ్యన్ అవరి మారి రొంబ పణక్కార్ ఆయిడువా.అవరిపేరు ఆరుముగం. (అతని పేరు పెట్టుకుంటే అతని మాదిరి నీ కొడుకు ధనవంతుడు అవుతాడు)

సుబ్బయ్య:- ( కోపంగా) ఆరుముగం, పదిముగం, ఏబది ముగం నా కొడుక్కుండేది ఒక్క ముఖమే.

సుబ్బమ్మ :- (శాంతంగా) సరి మామీ వేచ్చికరే పోయిట్టు వాంగో. (సరే మామీ పెట్టుకుంటాము)

(ఆండాళ్ నిష్క్రమణం బడి ప్యాన్ కరీం ప్రవేశం )

కరీం :- హేప్పీ హండీ సుబ్బియ్యగారూ! మీ యింటికీ పచ్చా పచ్చా తోరణాల్ బడా ముస్తాబ్ చేశార్ హియ్యాల్ మీదీ యింట్లో తద్దినం కానీ హుందా హండీ ?

సుబ్బమ్మ :- ఏమిటి సాయబూ ఆ అపభ్రంశపు మాటలు. రేపు మా అబ్బాయికి పేరు పెడుతున్నాము.

కరీం :- అయితే మాకీ ఒక పేరూ తోచింది చెప్తాం పెట్టండి.

సుబ్బయ్య :- (విసుగ్గా) ఇప్పటికే వాడి పేరు చేంతాడంత వుంది.

కరీం:- అందులో ఖాదర్ గారి పేరు హిర్కించండి.

సుబ్బయ్య :- ఎవడా ఖాదర్?

కరీం:- మాకీ ఫాదర్ బడా బడా హత్తర్ (అత్తరు) సాహెబ్. సెంట్ కీ వాస్నా చూసి తాగీ వేశార్. హోయనా పేరూ పెట్టండి సార్.

(కరీం నిష్క్రమణం సుబ్బయ్య స్నేహితుడు భావకవి ప్రవేశం)

భావకవి:- ఏమిట్రా సుబ్బయ్యా నీ కొడుక్కు పేరు పెడుతున్నావట..నేనొక పేరు చెప్తాను పెట్టు.

సుబ్బయ్య:- (నీరసంగా) చెప్పు.

భావకవి:- నీలసుందరం అని పెట్టు.

సుబ్బయ్య:- ఆఖరికి నవలల్లో పేరు పెట్టమంటావుట్రా?

భావకవి:- (కోపంగా) లేకపోతే హిస్టరీలో పేర్లు పెట్టుకో బాబర్, అక్బర్, హుమాయూన్ అని

సుబ్బయ్య :- అబ్బ కోప్పడకురా.

భావకవి కోపంగా నిష్క మిస్తాడు.

సుబ్బయ్య:- కొడుకును తలుచుకుంటూ తురకపేర్లూ, కిరస్తానీ పేర్లూ నీవు యునైటెడ్ నేషన్‌లో పుట్టవలిసిన వాడివిరా

మరుదినం బారసాల సీను:

పురోహితుడు పీట మీద కూర్చుని వుంటాడు. చుట్టూ పూలు పండ్లు, ఒక కంచంలో బియ్యము పూజా సామగ్రీ వుంటాయి.

పురోహితుడు:- రండి సుబ్బయ్య గారూ! పీట మీద కూర్చోండి.

సుబ్బయ్య పీట పైన కూర్చుంటాడు.

ముందురోజు వచ్చినవాళ్ళు, ఇంకా యిరుగు పొరుగు ఆడవాళ్ళు కూర్చొని వుంటారు.

పురోహితుడు:- దేవుడి దగ్గర దీపం వెలిగించండి ఆమ్మా అని కేక వేసి "శుక్లాంబర ధరం విష్ణుం" అని గణపతి పూజ మొదులు పెడతాడు.

పురోహితుడు:-- అమ్మా పిల్లాడిని తీసుకొని మీరు రావాలి. ఎవరైనా తీసుకొని రండి. ముహూర్తం దగ్గర పడింది... అని కేక వేశాడు.

సూరమ్మత్తతో పాటు సుబ్బమ్మ పిల్లాడిని ఎత్తుకొని వస్తుంది.

సుబ్బయ్య:- (కోపంగా) ఊళ్ళోని ముత్తయిదువులందరూ కట్టగట్టుకొని ఎక్కడికి వెళ్ళారు? నువ్వొచ్చావు తగుదునమ్మా అని.

అప్పుడు అక్కడ కూర్చున్న ఒక ముత్తైదువు లేచి వెళ్ళి సుబ్బమ్మను పిలుచుకొని వచ్చి జాగ్రత్తగా పీటమీద కూర్చో పెడుతుంది.

పురోహితుడు పూజ ముగించి సుబ్బయ్య యిచ్చిన పేపర్ తీసుకొని అందులో వ్రాసిన పేర్లు యిలా చదువుతాడు. బియ్యంలో యిన్ని పేర్లు పట్టవు కనుక చదువుతున్నాను... అంటూ

శ్రీవీర వెంకట జగ్గ హనుమాన్ శ్రీరామ నూకల భగవద్గీతా గేబ్రియల్ ఆరుముగం ఖాదర్ నీలసుందర పిచ్చయ్యశాస్త్రి"

సుబ్బయ్య:- ఎవడీ పిచ్చయ్య శాస్త్రి?

పురోహితుడు:- మా నాన్నగారి పేరండీ.

సుబ్బయ్య :-- తల కొట్టుకుంటూ అందరూ తమ తమ యిష్టం వచ్చిన పేర్లు నా కొడుక్కి పెట్టేయండి.

అందరూ కలిసి :- పిల్లలూ,పెద్దలూ, జంతువులూ సంతోషించే నామకరణానికీ జై!

-ః శుభం ః-



# Silver Sponsors

MASALA

CELEBRATION OF INDIAN FLAVORS

MASALA

INDIAN BAR AND GRILL

HEALTHY • TASTY • AUTHENTIC

AMARAVATHI'S

Food That Feels Like Home

# పూర్వపు అధ్యక్షుల మాట - మంతీ

మన నెబ్రాస్కా తెలుగు సమితి ప్రయాణంలో ఎందరో వ్యక్తులు తమ శ్రమను, అమూల్యమైన సమయాన్ని వెచ్చించి మన సంస్కృతిని ఈ గడ్డపై సజీవంగా ఉంచడానికి తోడ్పడ్డారు. ఒక పచ్చని పొలం అంటే కేవలం కనిపించే పైరు కాదు, ఆ పంట వెనుక దుక్కి దున్ని విత్తు వేసి మొక్కని కాపాడుకున్న ఉన్న శ్రమ, తపన ఉంది. అలాగే మన సమితి ఎదుగుదల వెనుక మన పూర్వ అధ్యక్షుల నిరంతర కృషి దాగి ఉంది. 'ఇంతింతై వటుడింతై' అన్న చందంగా మన సమితి ఎదగడానికి, సభ్యులందరినీ ఒకే కుటుంబంగా మలిచిన ప్రతి ఒక్కరికీ మా హృదయపూర్వక అభినందనలు మరియు కృతజ్ఞతలు.



| | | |
|---|---|---|
| పేరు | : | శ్రీమతి క్రాంతి అడిదాం గారు |
| పదవీ కాలం | : | 2012-13 |
| స్వగ్రామం | : | BHE, హైదరాబాద్, తెలంగాణ |

శ్రీమతి క్రాంతి అడిదాం గారు మొట్టమొదటిసారిగా 1996లో నెబ్రాస్కా రాష్ట్రంలోని ఒమహా నగరానికి వచ్చారు. ఆమె మహోన్నతాదర్శం, వాత్సల్య భావము, ప్రతిపాదన, నిర్ణాయక శక్తి అమలుపరుచు విధానం వలనే TSN పురుడుపోసుకుని ముందడుగు వేసిందనుటలో అతిశయోక్తిలేదు. తెలుగు సంస్కృతి పట్ల ప్రేమతో, సేవాభావంతో సమాజాన్ని ఏకం చేసే నాయకత్వంతో ఆమె చేసిన సేవలు సదా ఆచరణీయం.

**యువతకు సందేశం:-** వాలంటీరుగా మొదలు పెట్టండి, సేవ ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చు.

**అభిరుచులు:-** గానం మరియు వంట చేయడం



పేరు : **శ్రీ సత్యనారాణయ పావులూరి గారు**
పదవీ కాలం : 2013-14
స్వగ్రామం : నిడుబ్రోలు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

శ్రీ సత్యనారాయణ గారు 1988లో అమెరికా భూమిపై అడుగుపెట్టి, హ్యూస్టన్, ఫీనిక్స్, చికాగో, మేరీల్యాండ్ నగరాల్లో నివసించి 2002లో ఒమహా వచ్చి స్థిరపడ్డారు. ఆయన ప్రవాస జీవితాన్ని కేవలం వ్యక్తిగత ప్రయాణంగా కాక, సమాజ సేవయేమార్గంగా తలిచిన వ్యక్తిత్వం. TSN స్థాపక సభ్యులలో ఒకరిగా తెలుగు సమాజానికి బలమైన పునాది వేశారు. ఒమహా నగరంలో విస్తరించివున్న తెలుగు వారిని ఒకే తాటిపైకి తెచ్చి, భాషా - సంస్కృతి విలువలను పరిరక్షించాలనే దృఢ సంకల్పంతో ఆయన చేసిన సేవలు ఎంతో విశిష్టమైనవి.

**స్ఫూర్తినిచ్చిన వ్యక్తులు:-** తల్లిదండ్రులు మరియు
శ్రీ స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు

**యువతకు సందేశం:-** ఎప్పటికీ నూతన విద్యార్థిగా ఉండాలి,
నేర్చుకోవడాన్ని, ఎప్పుడూ ఆపకూడదు.



పేరు : **శ్రీ అశోక్ మాడుపల్లి గారు**
పదవీ కాలం : 2014-15
స్వగ్రామం : నిజామాబాద్, తెలంగాణ

శ్రీ అశోక్ గారు భారత్‌లో ఉన్నత విద్య పూర్తి చేసి, 1992లో అమెరికాకు వచ్చి పరిశోధన మరియు ఐటీ రంగాల్లో సేవలు అందించారు. 1999లో ఒమహాకు వచ్చి తన వృత్తిని కొనసాగించారు. TSN ప్రారంభ దశలో కీలక పాత్ర పోషించిన ఆయన, చిన్న స్నేహితుల సమూహాన్ని ఒక బలమైన కమ్యూనిటీగా అభివృద్ధి చేయడంలో విశేషంగా కృషి చేశారు. ప్రాంతీయతలకు అతీతంగా అందరినీ కలిపే "ఇంక్లూజన్" భావనతో, ప్రతి సభ్యునికి సమాన అవకాశాలు కల్పించే వాతావరణాన్ని నిర్మించారు. టీమ్ వర్క్, వాలంటీర్ల కృషి సంస్థ ఎదుగుదలకు పునాది అని ఆయన నమ్మకం.

**స్ఫూర్తినిచ్చిన వ్యక్తులు:-** శ్రీ భగత్ సింగ్, గారు, శ్రీ అజిత్ దోవల్ గారు

**అభిరుచులు:-** వాకింగ్, బైకింగ్, పికిల్‌బాల్, ఆరోగ్యకర జీవనశైలి

**యువతకు సందేశం:-** భాష, సంస్కృతిని కాపాడుతూ, కుటుంబ బంధాలను బలపరచాలి. పరస్పర గౌరవం, టీమ్ వర్క్‌తో కమ్యూనిటీ అభివృద్ధికి కృషి చేయాలి.



పేరు : **శ్రీ మహేష్ గూడారు గారు**
పదవీ కాలం : 2015-16
స్వగ్రామం : కమ్మపల్లి, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్

శ్రీ మహేష్ గూడారు గారు 2008లో ఒమహాకి వచ్చారు తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కాకు నాల్గవ అధ్యక్షుడిగా విశిష్ట సేవలు అందించారు. ఒక స్నేహితుడి ప్రోత్సాహంతో క్రీడా కార్యక్రమాల నిర్వహణలో అడుగుపెట్టిన ఆయన అక్కడ నుండి సంస్థ సేవలో మరింత చురుకైన పాత్ర పోషించారు. TSN లో తెలుగుబడి మరియు టెన్నిస్ క్రీడను పరిచయం చేసి కొత్త ఆరంభానికి శ్రీకారం చుట్టారు. TSN ను ఆర్థికంగా స్థిరపరచడంలో కీలక పాత్ర పోషించటమే కాకుండా, Sponsorship అనే భావనను పరిచయం చేసి సంస్థాభివృద్ధికి బలమైన పునాది వేశారు. దూరదృష్టి, కార్యదీక్ష, సమాజం పట్ల నిబద్ధత కలిగిన ఆయన సేవలు ఎంతో ఆదర్శం.

**స్ఫూర్తినిచ్చిన వ్యక్తులు:-** శ్రీ స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు
**అభిరుచులు:-** ప్రయాణం
**యువతకు సందేశం:-** సాటివారిని, తోటివారిని గౌరవంతో, దయతో, కరుణతో మెలగాలి అని చెప్పారు.



పేరు : **శ్రీ సోమశేఖర్ కోడాలి గారు**
పదవీకాలం : 2016-2017
స్వస్థలం : గన్నవరం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్

Paintathon ద్వారా TSNతో అనుబంధం ప్రారంభమైన కోడాలి సోమశేఖర్ గారు, అనంతరం సంస్థ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ విశిష్ట నాయకుడిగా ఎదిగారు. TSN 5వ అధ్యక్షుడిగా ఆయన Charity, Culture, Education అనే మూడు ప్రధాన సూత్రాలను సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. భారతదేశంలో హుద్‌హుద్ తుఫాన్ వల్ల ఇబ్బందులు పడిన వారికి TSN ద్వారా సహాయం అందించారు. అలాగే, సరోజినీ దేవి ఆసుపత్రిలో 50 మందికి పైగా కాటరాక్ట్ ఆపరేషన్లు TSN ఆధ్వర్యంలో నిర్వహింపజేసి ఎంతో మందికి వెలుగు నిచ్చారు. అంతేకాకుండా, భారతదేశంలో అవసరమైన వారికి కృత్రిమ కాళ్లు అందించే సేవా కార్యక్రమాలను TSN ద్వారా చేపట్టి, అనేక మందికి అండగా నిలిచారు. సేవా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక, విద్యా రంగాల్లోనూ సమాన దృష్టి పెట్టిన ఆయన, యువతలో నాయకత్వం, అనుబంధాలు, సేవాస్ఫూర్తి పెంపొందాలని ఆకాంక్షించారు. ఆయన సేవలు TSN చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

**అభిరుచులు :** క్రికెట్, వాలీబాల్, రాజకీయ వార్తలు.



పేరు : **శ్రీ నరేంద్ర సామ గారు**
పదవీకాలం : 2017-18
స్వగ్రామం : ముప్కల్, నిజామాబాద్, తెలంగాణ

వ్యవసాయ కుటుంబంలో జన్మించి, చిన్ననాటి నుంచే కష్టపడి పనిచేయడం, విలువలతో జీవించడం నేర్చుకున్నారు. గ్రామీణ జీవితానుభవాలు ఆయన వ్యక్తిత్వాన్ని, పని తీరును, సమాజపట్ల ఉన్న బాధ్యతను మరింత బలపరిచాయి. అనంతరం ఉన్నత విద్యను అభ్యసించి, విశాల దృక్పథంతో పాటు తన మూలాల పట్ల మరింత అనుబంధాన్ని పెంపొందించుకున్నారు. TSN 6వ అధ్యక్షుడిగా 2017-18 కాలంలో సేవలందించిన ఆయన, తెలుగు సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడంలో తన వంతు కృషి చేశారు. భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో సంస్థ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమాల నిర్వహణలో బృందస్ఫూర్తి, సమన్వయం, పరస్పర గౌరవం ఎంతో ముఖ్యమని నమ్మే ఆయన, సభ్యులందరినీ కలుపుకుపోయే నాయకత్వాన్ని ప్రదర్శించారు.

**స్ఫూర్తినిచ్చిన వ్యక్తులు :** తల్లిదండ్రులు



పేరు : **శ్రీ నాగరాజు ముదెళ్ల గారు**
పదవీకాలం : 2018-2019
స్వస్థలం : తాండూరు, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ

ముదెళ్ల నాగరాజు గారు TSN 7వ అధ్యక్షుడిగా విశిష్ట సేవలందించిన నాయకుడు. 1998లో తొలిసారిగా అమెరికాకు వెళ్లి, అక్కడే తన విద్యా మరియు వృత్తి ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లారు. సుమారు పదిహేనేళ్లు లింకన్‌లో నివసించిన ఆయన, 2014లో ఒమహాకు మారిన తరువాత TSN కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొన్నారు. 2013 నుంచే TSNలో సక్రియ సభ్యునిగా సేవలందిస్తూ, మూడు సంవత్సరాలు కమిటీ సభ్యునిగా కూడా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. లింకన్ కమ్యూనిటీ నుంచే TSN తో తన అనుబంధాన్ని బలంగా కొనసాగించిన ఆయనకు, సమాజంతో కలిసి ఉండటం ఆనందానికే కాదు, ఒక బాధ్యతకూ ప్రతీక. TSN లో చేసిన సేవల ద్వారా వ్యక్తిగా ఎంతో ఎదిగానని భావించే ఆయన, సంస్థ పట్ల తన అంకితభావాన్ని కార్యరూపంలో చూపించారు.

**యువతరానికి సందేశం :-** విశాల దృష్టితో, సానుకూల ఆలోచనతో, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటూ ముందుకు సాగాలి.

**అభిరుచులు :-** అవుట్‌డోర్ కార్యకలాపాలు, మారథాన్ రన్నింగ్, కమ్యూనిటీ ఇన్‌వాల్వ్‌మెంట్.



పేరు : **శ్రీ శరత్ బోడేపూడి గారు**
పదవీకాలం : 2019-2020
స్వస్థలం : పండితాపురం, ఖమ్మం జిల్లా, తెలంగాణ

శరత్ బోడేపూడి గారు తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (TSN) 8వ అధ్యక్షుడిగా విశిష్ట సేవలందించారు. అమెరికాకు వచ్చి నెబ్రాస్కాలో స్థిరపడిన ఆయన, తెలుగు సమాజ అభ్యున్నతికి తన వంతు సేవలను అందించారు. TSNలో ఆయన ప్రస్థానం సేవాభావం, ఆత్మీయత, సమాజపట్ల నిబద్ధతతో కొనసాగింది. కమ్యూనిటీ అభివృద్ధి, సభ్యుల భాగస్వామ్యం, సంస్థ బలోపేతం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, వివిధ కార్యక్రమాల ద్వారా తెలుగు సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడానికి కృషి చేశారు. నాయకత్వ ప్రయాణంలో ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంటూ, యువతను ప్రోత్సహించే కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. సేవా దృక్పథం, సాన్నిహిత్యం, సమాజం పట్ల ఉన్న అంకితభావం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయి.

**అభిరుచులు :** క్రికెట్, స్నేహితులతో సమయం గడపడం.



పేరు : **శ్రీ నవీన్ కాంటెం గారు**
పదవీకాలం : 2022-2023
స్వస్థలం : కొత్తగూడెం, భద్రాద్రి, తెలంగాణ

నవీన్ కాంటెం గారు TSN 10వ అధ్యక్షుడిగా సేవలందించారు. చిన్ననాటి నుంచే విద్యాభ్యాసం, భాషలపై ఆసక్తి పెంపొందించుకున్న ఆయన, తెలుగు మరియు హిందీ భాషలపై మంచి పట్టు సంపాదించారు. సత్యం కంప్యూటర్స్ ద్వారా అమెరికాకు వచ్చి, అనంతరం ఒమహాలో స్థిరపడ్డారు. 2014లో TSN సభ్యత్వం తీసుకుని సంస్థతో తన అనుబంధాన్ని ప్రారంభించారు. ఆ తరువాత TSN కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజంతో తన బంధాన్ని మరింత బలపరిచారు. కోవిడ్ సమయంలో తెలుగు బడిని ఆన్‌లైన్‌లో కొనసాగించడంలో, కోవిడ్ అనంతరం అదే కార్యక్రమాన్ని మళ్లీ ప్రత్యక్ష రూపంలో నిర్వహించడంలో ఆయన విశేష కృషి చేశారు. TSN కార్యక్రమాల ద్వారా కొత్త తరాన్ని తమ మూలాలతో అనుసంధానించే దిశగా ఆయన చేసిన సేవలు ప్రత్యేకంగా నిలిచాయి.

**యువతకు సందేశం :** TSN ద్వారా మనం మన మూలాలతో అనుసంధానమయ్యే అమూల్యమైన అవకాశం లభిస్తుంది.



పేరు : **శ్రీ దిలీప్ దోనెపూడి గారు**
పదవీకాలం : 2023-2024
స్వస్థలం : కాటూరు, ఉయ్యూరు మండలం, కృష్ణ జిల్లా, ఆంధ్రప్రదేశ్

శ్రీ దిలీప్ గారు తమ బాల్యం మరియు విద్యాభ్యాసాన్ని ఉయ్యూరు, గుడివాడ, విజయవాడ ప్రాంతాల్లో పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలపై ఆసక్తి చూపుతూ, సమాజ సేవలో భాగస్వామ్యం కావడం అలవాటుగా కొనసాగించారు. అమెరికాకు వచ్చిన తర్వాత కూడా ఈ ఆసక్తి కొనసాగిస్తూ, తెలుగు కమ్యూనిటీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఒమహాకు వచ్చిన తరువాత శ్రీ శరత్ బోడేపూడి గారి ప్రోత్సాహంతో తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (TSN) లో చేరి, సంస్థ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. TSN ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు, సమాజ సమావేశాలు మరియు కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ, తెలుగు సంస్కృతి పరిరక్షణకు తన వంతు కృషి చేస్తున్నారు.

**స్ఫూర్తినిచ్చిన వ్యక్తులు :** శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, శ్రీ ఎన్టీ రామారావు గారు
**ప్రత్యేక ఆసక్తులు :** సామాజిక సేవ, కమ్యూనిటీ కార్యకలాపాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం.




పేరు : **శ్రీ రాజా కోమటి రెడ్డి గారు**
పదవీకాలం : 2024-2025
స్వస్థలం : సిద్ధిపేట, తెలంగాణ

రాజా కోమటి రెడ్డి గారు తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (TSN) 12వ అధ్యక్షుడిగా విశిష్ట సేవలందించారు. కుటుంబ విలువలు, సేవాభావం, సమాజం పట్ల నిబద్ధత ఆయన వ్యక్తిత్వానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి. విద్యాభ్యాసం పూర్తిచేసుకుని అమెరికాకు వచ్చిన ఆయన, ఒమహాలో స్థిరపడి తెలుగు సమాజంతో బలమైన అనుబంధాన్ని ఏర్పరుచుకున్నారు.

TSN లో ఆయన ప్రస్థానం సేవాభావంతో ప్రారంభమై, క్రమంగా నాయకత్వ బాధ్యతల వరకూ ఎదిగింది. తెలుగు బడి, సాంస్కృతిక కార్యక్రమాలు, సంస్థాభివృద్ధి వంటి అనేక రంగాల్లో చురుకుగా పాల్గొని తన ముద్ర వేశారు. ట్రెజరర్, వైస్ ప్రెసిడెంట్ వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన తరువాత, 12వ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. సేవను పదవిగా కాకుండా బాధ్యతగా భావించిన ఆయన, తన అంకితభావం మరియు కృషితో TSN అభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డారు. ఆయన సేవలు TSN చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

**అభిరుచులు :** కుటుంబంతో సమయం గడపడం, పుస్తకాలు చదవడం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విషయాలపై ఆసక్తి చూపడం.

# Silver Sponsors




ALOFT

TECHNOLOGIES, LLC

# ఉగాది ఉత్సవాలకు క్రీడా కిరీటం చుట్టిన
## తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా

రచన: వీణమాధురి ద్రోణాదుల

విదేశీ నేలపై తెలుగు సంస్కృతి వెలుగులు నింపుతూ, సమాజ ఐక్యతకు సజీవ రూపంగా నిలుస్తున్న తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (TSN), ఉగాది సంబరాలను ప్రతి సంవత్సరం మరింత అర్థవంతంగా, మరింత ఆత్మీయంగా నిర్వహిస్తూ వస్తోంది. పండుగ ఆనందాన్ని కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, క్రీడాస్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం, పరస్పర అనుబంధం అనే విలువలను కూడా సమానంగా ముందుకు తీసుకువెళ్లే విశిష్ట సంప్రదాయాన్ని TSN నిరంతరం కొనసాగిస్తోంది. ఈ ఏడాది కూడా ఉగాది వేడుకల సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలు, సభ్యుల హృదయాల్లో చెరగని ముద్ర వేసాయి.

మార్చి నెల అంతా నెబ్రాస్కా తెలుగు సమాజాన్ని ఉత్సాహోత్సాహాలతో ముంచెత్తుతూ బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, పికిల్‌బాల్, చెస్, క్యారమ్ వంటి విభిన్న క్రీడా పోటీలు అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నారుల నుంచి యువత వరకు, మహిళల నుంచి పెద్దల వరకు అందరికీ అవకాశం కల్పిస్తూ రూపొందించిన ఈ క్రీడోత్సవాలు, TSN సమగ్ర దృక్పథాన్ని ప్రతిబింబించాయి. ప్రతి పోటీ వెనుక కేవలం గెలుపోటములకే పరిమితమైన ఉద్దేశం కాకుండా, ఒక సమాజాన్ని మరింత దగ్గర చేయాలనే ఆలోచన స్పష్టంగా కనబడింది.

మార్చి 1న నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఈ క్రీడా వేడుకలకు అద్భుతమైన ఆరంభం పలికింది. ఆటగాళ్ల వేగం, ఏకాగ్రత, పట్టుదల కోర్టులో మెరిసిపోగా, ప్రేక్షకుల హర్షధ్వానాలు ఆ ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేశాయి. ప్రతి షాట్‌లో పోటీతత్వం కనిపించినా, ప్రతి చిరునవ్వులో ఆత్మీయత, ప్రతి కరచాలనంలో క్రీడాస్ఫూర్తి ప్రతిఫలించింది.

దీని తర్వాత నిర్వహించిన టెన్నిస్ టోర్నమెంట్ మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టెన్నిస్ కోర్టులో కనిపించిన నైపుణ్యం, సమన్వయం, దూకుడు పోటీలకు కొత్త ఉత్సాహాన్ని తెచ్చాయి. ముఖ్యంగా కుటుంబ సమేతంగా సభ్యులు హాజరవడం, పిల్లలు పెద్దలను ప్రోత్సహించడం, పెద్దలు చిన్నారులను ఉత్తేజపరచడం ఈ క్రీడా వాతావరణానికి మరింత అందాన్ని జోడించాయి.

చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఈ ఉగాది క్రీడోత్సవాలలో విశేష ఆకర్షణగా నిలిచింది. మైదానంలో పిల్లలు చూపించిన చురుకుదనం, ధైర్యం,

ఉత్సాహం అందరినీ ముగ్ధులను చేసింది. వారు వేసిన ప్రతి అడుగు, చేసిన ప్రతి ప్రయత్నం కేవలం ఆట మాత్రమే కాకుండా, భవిష్యత్తు తరాల ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా కనిపించింది. చిన్నారుల్లోని ఆ ఎనర్జీని చూసి తల్లిదండ్రులు, నిర్వాహకులు, ప్రేక్షకులు అందరూ హర్షం వ్యక్తం చేశారు.

అలాగే పికిల్‌బాల్ టోర్నమెంట్ ద్వారా పురుషులతో పాటు మహిళలకు, మిక్స్‌డ్ జట్లకు కూడా సమాన ప్రాధాన్యం కల్పించడం TSN విశాల దృక్పథాన్ని చాటిచెప్పింది. పురుషుల డబుల్స్, మహిళల మరియు మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో కనిపించిన పోటీ తత్వం, అనురాగం, సమన్వయం అందరినీ ఆకట్టుకున్నాయి. కుటుంబ సభ్యులు ఒకరినొకరు ప్రోత్సహిస్తూ, స్నేహితులు ఒకరికి మరొకరు తోడుగా నిలుస్తూ కనిపించిన దృశ్యాలు ఈ క్రీడా వేడుకల అసలైన అందాన్ని తెలియజేశాయి.

ఇక చెస్ టోర్నమెంట్ మేధస్సుకు పదును పెట్టిన వేదికగా నిలిచింది. ప్రతి కదలికలో ఆలోచన, ప్రతి నిర్ణయంలో వ్యూహం, ప్రతి మ్యాచ్‌లో మేధోపరమైన పోటీ కనిపించింది. క్షణక్షణం ఉత్కంఠ రేపిన ఈ పోటీలు, క్రీడలంటే కేవలం శారీరక చురుకుదనమే కాదు, మానసిక సమతుల్యత కూడా ముఖ్యమని గుర్తు చేశాయి.

క్యారమ్ టోర్నమెంట్ అయితే ఈ క్రీడా మహోత్సవాలకు మరింత కుటుంబ సమేత ఆత్మీయతను జోడించింది. చిన్నారుల విభాగం నుంచి పెద్దల విభాగం వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. చిన్న పిల్లల ఏకాగ్రత, యువతలో కనిపించిన పోటీ భావన, పెద్దలలో కనిపించిన అనుభవం, సీనియర్ సభ్యుల పట్టుదల – ఇవన్నీ కలిపి క్యారమ్ పోటీలను ఒక మధురమైన జ్ఞాపకంగా మార్చాయి. ఒక చోట చేరి, ఒకరికొకరు ప్రోత్సాహం అందిస్తూ, గెలుపు–ఓటములను సమానంగా స్వీకరిస్తూ పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని మరింత గొప్పదిగా తీర్చిదిద్దారు.

ఈ క్రీడా పోటీలు కేవలం వినోదం కోసం నిర్వహించిన కార్యక్రమాలు కావు. ఇవి ఆరోగ్యాన్ని ప్రోత్సహించే వేదికలు. ఇవి కుటుంబాలను కలిపే సందర్భాలు. ఇవి చిన్నారుల్లో ధైర్యాన్ని పెంపొందించే అవకాశాలు. ఇవి యువతలో పోటీ తత్వాన్ని మెరుగుపరచే సాధనాలు. ఇవి పెద్దలలో పాల్గొనే ఉత్సాహాన్ని మళ్లీ మేల్కొలిపే వేడుకలు. అంతకంటే ముఖ్యంగా, ఇవి ఒక సమాజం కలిసికట్టుగా ముందుకు సాగేందుకు అవసరమైన ఐక్యతను మరింత బలపరచే బంధాలు.

ఈ గొప్ప క్రీడా మహోత్సవాల విజయవంతమైన నిర్వహణ వెనుక ఉన్న నిర్వాహక బృందం, స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు, వాలంటీర్లు, స్పాన్సర్లు, సభ్యుల సహకారం ప్రత్యేకంగా అభినందనీయం. ప్రతీ కార్యక్రమాన్ని చక్కగా ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం, సమయపాలన పాటించడం, పాల్గొనేవారికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, ప్రతి విభాగానికి సమాన ప్రాధాన్యం ఇవ్వడం ఇవన్నీ TSN నిర్వహణలోని నిబద్ధతకు నిదర్శనాలు.

ప్రవాస భూమిలో భాషను, సంస్కృతిని, సంప్రదాయాలను నిలబెట్టడం ఎంత ముఖ్యమో, సమాజాన్ని ఒకటిగా ఉంచడం అంతకంటే ముఖ్యమైంది. ఆ బాధ్యతను హృదయపూర్వకంగా నెరవేర్చుతూ, ఉగాది పండుగకు క్రీడా మహోత్సవ శోభను జోడించి, ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపిన తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా నిజంగా ప్రశంసనీయం. ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం ద్వారా TSN ఒక సమాజాన్ని కేవలం కలుపుకోవడమే కాదు, తరతరాలకు స్ఫూర్తినిచ్చే విలువలను కూడా అందిస్తోంది.

ఉత్సవం అంటే ఆనందం, క్రీడ అంటే ఉత్సాహం, సమాజం అంటే ఐక్యత ఈ మూడు విలువలను అద్భుతంగా మేళవించి ఉగాది సంబరాలకు ప్రత్యేక మహిమను తీసుకువచ్చిన తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా క్రీడా కార్యక్రమాలు నెబ్రాస్కా తెలుగు సమాజ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయి.



# బ్యాడ్మింటన్

## బ్యాడ్మింటన్ విన్నర్స్



## బ్యాడ్మింటన్ రన్నర్స్










# బాస్కెట్ బాల్

బాస్కెట్‌బాల్ హై విన్నర్స్



బాస్కెట్‌బాల్ హై రన్నర్స్



బాస్కెట్‌బాల్ మిడ్ విన్నర్స్




బాస్కెట్‌బాల్ మిడ్ రన్నర్స్




బాస్కెట్‌బాల్ ఎలిమెంటరీ







# క్యారమ్స్

## క్యారమ్స్ మేన్స్ విన్నర్స్




## క్యారమ్స్ మేన్స్ రన్నర్స్




## క్యారమ్స్ కిడ్స్ విన్నర్స్ & రన్నర్స్




## క్యారమ్స్ కిడ్స్




## క్యారమ్స్



# చెస్

## చెస్



## చెస్



## చెస్



# టెన్నిస్

## టెన్నిస్ మెన్స్ విన్నర్స్




## టెన్నిస్ మెన్స్ రన్నర్స్



## టెన్నిస్ కిడ్స్ విన్నర్స్




## టెన్నిస్ కిడ్స్ రన్నర్స్












# పికిల్ బాల్

### పికిల్ బాల్ మిక్స్‌డ్ డబుల్ విన్నర్స్




### పికిల్ బాల్ మిక్స్‌డ్ డబుల్ రన్నర్స్



### పికిల్ బాల్ మెన్స్ విన్నర్స్




### పికిల్ బాల్ మెన్స్ రన్నర్స్



### పికిల్ బాల్ ఉమెన్స్ విన్నర్స్



### పికిల్ బాల్ ఉమెన్స్ రన్నర్స్



# పికిల్ బాల్


Omaha's New Favourite
Indian Kitchen
Serving Fresh, Authentic Flavors
Every Day
WE DELIVER








Omaha's New Favourite
Indian Kitchen
WE DELIVER


Telugu Samiti Of Nebraska

# Silver Sponsors

CAP8

INVESTMENTS



# పోటీ (వ్యాసం)

రచన: సునీల్ దొడ్డపనేని

ప్రపంచంలో అడుగడుగునా పోటీ, ఎటు చూసినా పోటీ. పోటీ అంటే తెలియనివారు ఉంటారని నేను అనుకోను. అయితే పోటీల్లో చాలా రకాలున్నాయండోయ్. 'సమాజం నన్ను చిన్న చూపు చూసింది, సమాజానికి నేనేంటో చూపిస్తాను' అంటూ బయలుదేరతాడు చాలా సినిమాల్లో మన హీరోగారు. అలాంటిదే, కొంచెం తేడాతో, ప్రేమించుకున్నాం సమాజానికి మేమేంటో చూపిస్తాం అంటుంటారు మన హీరో హీరోయిన్లు. ఇలాంటి సమాజం మీద పోటీలు సాధారణంగా సినిమాల్లో ఎక్కువ కనిపిస్తున్నా బయట కూడా కొద్దో గొప్పో జరుగుతుంటాయని నా అభిప్రాయమూ, అనుభవమూను. ఇకపోతే పిల్లల మధ్య పోటీ. అది ఏనాడూ శ్రుతి మించదు, అవతలి వారి చెడుని కోరుకోదు. అసలు ప్రమాదమంతా పెరిగిన పెద్ద మనుషుల మధ్య పెరిగే పోటీతోనే.

మొన్నీ మధ్య కొత్తగా కాపురం పెట్టిన స్నేహితుడి ఇంటికి భోజనానికి వెళ్ళాను. మామూలుగా మాటల మధ్య, భవిష్యత్తులో ఉపయోగపడుతుంది కదా అని, "మీరేమి అనుకోనంటే ఒక చిన్న విషయం (నాకసలే మొహమాటం ఎక్కువ లేండి), మీకు నెలకి ఎంత ఖర్చవుతుందండి" అని అడిగాను. "దానికేముంద"ని ఆ అమ్మాయి వివరం చెప్పి, చివరగా చిన్న సందేహం వెలిబుచ్చింది, "ఎందుకు ఇక్కడ ఎదుటివారి జీతం గురించి, జీవితం గురించి తెలుసుకోవాలని ప్రయత్నిస్తుంటారు". నాకు నిజమే అనిపించింది. రెండోది భారతదేశంలో కూడా అనుభవమే కానీ మొదటిది మాత్రం అక్కడ అంతగా కనిపించదు. అవతల మనిషి చదువు, చేసే ఉద్యోగం మనకి సంబంధం లేకపోయినా, జీతం గురించి కనుక్కోవడం మాత్రం మర్చిపోము. ఎందుకు? నాకు తోచిన సమాధానం 'పోటీ'. ఆ పోటీ మొదలు కోసం వెతికితే అక్కడ అసూయ కనిపించింది.

అలా అని నేను ఏ పోటీకి వ్యతిరేకిని కాను. పోటీ లేకపోతే మనిషి ఎదుగుదల లేదని నమ్మేవారిలో మొదటి వాడను నేను. కానీ పోటీ అనేది ఒక మనిషిని పైకి తీసుకెళ్ళేదిగా ఉండాలి కానీ అవతల మనిషిని కిందకి తోసేలా ఉండకూడదని నా ఉద్దేశ్యం. "అదెలా సాధ్యం, పరీక్షలో నాకు మొదటి స్థానం వచ్చిందంటే ఎవరిదో నేను తీసుకున్నట్టేగా" అని మీరనవచ్చు. అందులో తప్పేమీ లేదు, నా ఉద్దేశ్యం అది కాదు, 'పరీక్షల్లో మంచి మార్కులు రావాలంటే మీరు బాగా చదవాలి, అంతే గానీ పక్కవాడ్ని పరీక్ష రాయకుండా చేయకూడదు' అని అంతే కారు కొనాలని షోరూమ్ కి వెళ్లి మనకు నచ్చినది కాకుండా పక్కవాడి కంటే మెరుగైనది (మనకి అంతగా నచ్చకపోయినా) తీసుకునేదాకా ఈ పోటీ వెళ్లకుంటే అదే చాలు.

కాబట్టి, మన పోటీ పక్కవాడితో కాదు... నిన్నటి మనకంటే ఈరోజు మనం ఎంత మెరుగ్గా ఉన్నామనే విషయంలో ఉండాలి. అదే నిజమైన విజయం!

# ప్రయాణం (కథ)

రచన: సునీల్ దొడ్డపనేని

చుట్టూ చిమ్మటి చీకటి. గాలిలో తెలియని ఒక రకమైన తేమతో కూడిన వింతైన వాసన. దాంతో పాటు చెవులకి అందినా అర్ధం కాని గోష. దగ్గరలో మండుతున్న చితి నుంచి పెటేళ్ళున కపాలం పేలిన శబ్దం. తీతువు పిట్ట ఆయువు తీరినట్టు పెట్టిన ఆక్రందన. ప్రళయాంకురం వేసినట్టు దూరంగా ఆకాశంలో ఒక పెద్ద మెరుపు. ఆ వెలుగులో నాకు కనిపించిన దారిలో నేను వడి వడిగా ముందుకు సాగుతున్నాను. ఈ దారెమ్మట ఇంటికి చేరాలంటే ఇంకో గంట పైనే పట్టొచ్చు. కానీ మద్యలో తగిలే డొంకెమ్మటే వేళ్తే అరగంటలో చేరొచ్చు.

నాకు చాలా చిరాగ్గా ఉంది. ఆ రోజు ఉదయం మార్కులు తక్కువ వచ్చాయని నాన్న జనపనారతో ఒంటి మీద అంట్లు తేలేట్టు కొట్టాడు. ఆ కోపంతో కొట్టంలో పొలంలో కొట్టడానికి పెట్టుకున్న ఎండ్రిన్ డబ్బా తెచ్చుకున్నాను తాగుదామని. ఇప్పుడు సీత ఉంటే ఎంత బాగుండేదో. దూరంగా కనిపించే సెల్ టవర్ మీద ఎర్ర లైట్లు సీత పెట్టుకునే సీతాకోకచిలక జడక్లిప్పుల్లా మిల మిల మెరుస్తున్నాయి. సీత మా పక్కింట్లో అద్దెకుండే గ్రామీణ బ్యాంకు గుమాస్తా కూతురు, బళ్ళో నా క్లాసే. చిన్నప్పటి నుండి కలిసి పెరిగాం, కలిసి బడికి పోయేవాళ్ళం, కలిసి ఆడుకునేవాళ్ళం. తను ఏదడిగినా చేసేబుద్ధయ్యేది. బాగా చదివేది, నన్ను కూడ చదువుకోమని చెప్పేది. నాకేమో చదువు అంతగా ఎక్కేది కాదు. నాన్న తిడతా ఉంటే తప్పించడానికి ఏదో పనుందని బయటకి తీసుకెళ్లేది. నాన్నకి కూడా సీత అంటే మురిపెం, తాను అడిగితే కాదనేవాడు కాదు. పెద్దవుతున్న కొద్దీ నా స్నేహితులు ఎంత ఎకసెక్కాలు చేసిన సీత కోసం వాటిని నేను పట్టించుకునే వాడిని కాదు. ఇద్దరం పొలాలెమ్మడ పరిగెట్టేవాళ్ళం, జీళ్ళు తీసేసి వదిలేసిన జీడిమామిడి పళ్ళు తెచ్చుకుని ఇంటిముందు వేప చెట్టు కింద కూర్చుని తినేవాళ్ళం. రెండేళ్ల క్రితం నా పదమూడో పుట్టినరోజు ముందు రోజే వాళ్ళ నాన్న వేరే ఊరు ట్రాన్స్ఫర్ అయ్యిందని వెళ్లిపోయారు. కొన్ని రోజులు పాటు నాకు ఏమి అర్థం కాలేదు.

అంతలో ఒక్కసారిగా ఉరిమిన ఉరుము శబ్దంతో సీత జ్ఞాపకాల పొరల్లోంచి ఉలిక్కిపడి బయటపడ్డాను. చీకటిని చీల్చుకుంటూ ముందుకు సాగుతున్నాను. ఎదురుగా జుట్టు విరగబోసుకున్న బ్రహ్మ రాక్షసిలా ఊడల మర్రి చెట్టు. దాని మీద దెయ్యాలు ఉంటాయని, చీకటి పడ్డాక అటు వైపు ఎవరూ రారు. మా బళ్ళో ఎంకటి అని ఉండేవాడు. వాళ్ళ నాన్న దర్జీ పని చేసేవాడు. ఎంకటి వొట్టి వెర్రి బాగులోడు. వాడ్ని బళ్ళో అందరు తెగ ఆటపట్టించే

వాళ్ళు, నేనూ అప్పుడప్పుడూ వాళ్ళతో కలిస్తే సీత తిట్టేది. ఒకరోజు వాడ్ని ఆట పట్టించటానికి రాత్రి మర్రి చెట్టు దగ్గిరకి వెళ్ళొస్తే తర్వాత అన్ని ఆటల్లో వాడ్ని చేర్చుకుంటాం అన్నారు. ఆ రోజు ఆరింటికి ఎళ్లినోడు రాత్రి పదైన తిరిగి రాలేదు. ఈ విషయం వాళ్ళ నాన్నకి తెలిసి లబోదిబోమంటూ ఊళ్ళో వాళ్ళని వెంటబెట్టుకొని వెళ్తే అక్కడ ఎంకటి మర్రి చెట్టు కింద పిచ్చి చూపులు చూస్తూ కనపడ్డాడు. ఆ తరువాత వాడు ఎప్పటికి మాములు మనిషి కాలేదు. వాడిలో వాడే మాట్లాడుకునేవాడు. బిత్తర చూపులు చూస్తూ ఉండుండి ఉల్లిక్కిపడేవాడు. వాడి ఇంట్లో వాళ్ళని చూస్తుంటే గుండె తరుక్కుపోయేది. వాళ్ళ నాన్న కొడుకుని అలా చేసిన ఆ ఊళ్ళో ఉండలేక కుటుంబాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

ఇప్పుడు ఎంకటి ఎక్కడున్నాడో ఏమయ్యాడో. ఇంతలో వెనుక నుండి జుయ్ మంటూ వచ్చిన చిన్నకారు చెట్టంత మనిషిని నేను కనపడనట్టే గుద్దినంత పని చేస్తూ తారు రోడ్డుని మింగేస్తూ ముందుకు సాగిపోయింది. ఎదురుగా నేను తిరగాల్సిన డొంక. చిన్నగా వర్షం తుంపరలు మొదలయ్యాయి. ఇలాంటప్పుడు అమ్మ చేసే వేడి వేడి పునుగులు, వాటిలోకి అల్లం పచ్చడి గుర్తొస్తున్నాయి. ఈ డొంక దారి దాటి ఎలాగైనా ఇంటికి వెళ్ళి అమ్మ చేతి వంట తినాలనిపిస్తోంది. అమ్మ పొద్దునే ఉన్న రెండు గేదెల పాలు తీసి, ఇంటి పని, వంట పని చేసుకుని పొలం పట్టుకెళ్తుంది. ఇంకా రోజంతా నాన్నకి సాయంగా అక్కడే ఉంటుంది. గేదెల్ని పక్కనే ఉండే డాబావోరి పాలేరు వాళ్ళ మందతో పాటు తోలుకెళ్తాడు. ఉన్న కుంట పొలంని నాన్నే సొంతంగా సాగు చేస్తాడు. ఉన్నంతలో ఒక పక్క కొంత బిన్నీ గడ్డి ఏస్తారు. నేను అమ్మని ఇవి రోజు బయట పచ్చ గడ్డి ఇంట్లో ఎండు గడ్డి తింటాయి కదా మళ్ళీ ఉన్న కొంత పొలంలో ఈ గడ్డెందుకే ఎయ్యడం అంటే, 'నీకు పునుగులు ఎట్లనో వాటికి బిన్నీ గడ్డి అట్లా' అనేది.

మనసంతా ఇంటి మీదే ఉంది. అమ్మా నాన్నలంటే నాకు ఎంత ఇష్టమో వాళ్ళకి చెప్పాలి. నాన్న కొట్టిన దెబ్బల తాలూకు నెప్పి కూడా తెలియట్లేదు, బహుశా ఈ వాన చలికి మొద్దుబారిపోయిందేమో. ఎలాగోలా ఊరి పొలిమేర దాటి మా వీధిలోకి అడుగుపెట్టాను. మా ఇల్లు కనిపిస్తోంది. ఇంటి ముందు జనం. ఒక్క ఉదుటున ఇల్లు చేరాను. అమ్మ ఇంటి ముందు వసారాలో కూర్చుని ఏడుస్తుంది, భుజం మీద చెయ్యేసి పక్కనే పిన్నమ్మ. అటు వైపు అరుగు మీద గోడకి జారిగిలాపడి నాన్న ఆకాశాన్ని చూస్తూ కూర్చున్నాడు. ఇంకాస్త ముందుకు వెళ్ళాను, అక్కడ గడపకెదురుగా దండేసి దీపం పెట్టిన ఫోటో. ఆ ఫోటోలో నేను...... గాలిలో కలిసిపోతున్న నాకు అప్పుడు గుర్తొచ్చింది, ప్రొద్దున ఎండ్రిన్ తాగినప్పుడు పేగులు మెలి పెట్టేసిన బాధ.

-: శెలవు :-

# Bronze Sponsors

NAWABI
Hyderabad house
Biryani Place




MAHARAJA
INDIAN CUISINE

# అనురాగమాధవీయం (కవిత)

రచన: సునీల్ దొడ్డపనేని

మాధవీలరా కుసుమ సుధా వీక్షికా
మరు మల్లికా ఉదధి తరంగ హాసితా
నిశి తారకా సౌదామినీ సరి ఉత్తేజితా
కర దీపికా కవయ కవితా నాయికా

నీ కోసం నా ప్రతీ క్షణం
నీ శ్వాసే నా విశ్వాసం నిజం
ఎలా చెప్పను నీకి విషయం
నాకు తెలిసిన భాష శూన్యం

ఓ ప్రాణమా ఇది నీకు తెలుసునా
నువ్వు వేరు కాదని నా మనసు నీవని
తెలిసి అలుసు చేయకు నా జీవమా
నువ్వు లేని నేను నిన్నగా మారిపోనా

కంటికి రెప్పగా నిను కాచుకోనా
కలలో కూడా నిను మరిచిపోనుగా
నీ నీడైనా చాలు నేను బ్రతుకుతానే బొమ్మ
దాగుడుమూతలాపి ఇకనైనా దరిచేర్చుకోమా

తాపంతో దగ్గరికి తీసుకున్నా
కోపంతో కసురుకున్నా.
నిన్ను కాదని నేను ఉండలేనుగా
నువ్వు లేని నాడు నేను లేనుగా

అన్నీ నీవై ఉన్నానే కన్నా
దూరాన్ని దరికి కూడా చేరనీయనమ్మ
కష్టానికైనా కష్టమని దూరమయేదాకా
పసికూనలా నిను నా ఒడిలో దాచుకోనా

# మీరు బలి - The Beginning (హాస్య గల్పిక)

రచన: సునీల్ దొడ్డపనేని

గమనిక: ఈ గల్పిక లోని పాత్రలు మరియు సంఘటనలు యధార్థానికి ఎంత దగ్గరగా ఉన్నా అవి కల్పితం మాత్రమే. నన్ను నమ్మండి. ఇది నిజం, అంటే అబద్ధం కాదు. ఒకవేళ అబద్ధం అయితే రచయితకు సంబంధం లేదు. సంబంధం ఉందనిపిస్తే మీకు నాకు సంబంధం లేదు.

పనిలో పని ఇంకో గమనిక: ఇది ప్లేస్ హోల్డర్ మాత్రమే. గుర్తొచ్చినప్పుడు నింపుతా..

అసలు కథః ఫలానా సంవత్సరం ఫలానా వారం ఫలానా రోజు పలానా దేశంకి వెళ్లి రావాలనుకున్నాము. ఆఖరి ఫలానాలో "భారత" పెట్టుకోండి. కథ కోసం రెడీమేడ్ టెంప్లేటు వాడితే ఇదే బాధ. సరే విషయానికి వద్దాం. పైన చెప్పినట్టు అనుకున్నామా (మీరు ఇక్కడ చదవడం ఆపి "అనుకున్నారు" అనాలి), అలానే ఇంకోటి కూడా అనుకున్నాము, ఈసారి ఎంత ఖర్చు అయినా లగ్జూరియస్గా వెళ్లాలి అని. అందుకే కొంచెం ఖర్చు ఎక్కువ అయినా పిప్పులో కాకుండా ఆరు నెలల ముందే ఫ్లైటులో టికెట్టు తీసుకున్న. మీరు అపార్థం చేసుకున్నారు, ఫ్లైటులో అంటే ఫ్లైటులోపల టికెట్ కౌంటర్ తెరిచారు అని కాదు, అయినా అలా అమ్మే స్థాయికి ఇంకా విమానయాన సంస్థలు ఎదగలేదు. ఏజెంట్ కి క్రెడిట్ కార్డు నెంబరు ఇచ్చి టికెట్టు బుక్ చేశా. వారం తర్వాత చూస్తే అదే టికెట్టు వంద డాలర్లు తక్కువకి ఉంది. అదే మరి. మన అదృష్టం ఎప్పుడు మనకంటే ఒక అడుగు ముందే ఉంటుంది, అంటే మనతో ఎప్పుడు ఉండదన్న మాట.

సరే టికెట్స్ బుక్ అయిపోయాయి కాబట్టి ఇప్పుడు ఆఫీస్‌లో బాస్‌కి చెప్పి సెలవలకి పర్మిషన్ తీసుకోవాలి. ఈ సమయంలో అదృష్టాన్ని నమ్ముకోవడం మానేసి మన లోని ఆస్కార్ నటుడ్ని బయటకి తీయాలి. మనం ఆరు నెలల ముందే టికెట్ కొన్నా మన ట్రిప్పు విషయం బాసుకి మాత్రం నెల ముందు మాత్రమే చెప్పాలి. అప్పుడు కూడా టికెటు బుక్ చెయ్యడానికి బాసు బాబు (పాప) పర్మిషన్ కోసం వచ్చామని చెప్పాలి. పనిలో పనిగా బేక్ పాకెట్ నుంచి దువ్వెన తీసి జుట్టున్నా లేకపోయినా బాసుని దువ్వటం మొదలెట్టాలి. నేను అదే చేశా మరి. ఆరు వారాల దగ్గర మొదలెట్టి చివరికి మూడు వారాల సెలవలకి బేరం కుదుర్చుకున్నాను (మీకు నాలుగు వారాలు సెలవు కావాలంటే ఎనిమిది వారాలతో బేరం మొదలెట్టవలసిందిగా నేను ఉచితంగా ఇచ్చే అనుచిత సలహా).

ఇంకా నా ట్రిప్పుకి నెల రోజులు మాత్రమే ఉంది కాబట్టి నాలోని హాలీవుడ్ నటుడ్ని నిద్రపుచ్చి "జగమంత కుటుంబం నాది ఏకాకి జీవితం నాది" అని పాడుకుంటూ చక్రం సినిమాలోని ప్రభాస్ ని లేపాను. అంటే ఈ నెల రోజులు చుట్టాలతో, ఫ్రెండ్సుతో కమ్యూనికేషన్ కట్ అన్నమాట. లేకపోతే వాళ్లు ఇచ్చే షాపింగ్ లిస్ట్ పూర్తి చేయడానికి నా ఆర్థిక స్తోమత సరిపోదు.

ఇన్ని తెలివితేటలు ఉండటం మూలానేమో నేను నేనయ్యాను, లావయ్యాను, అయినా ఆ విషయ ప్రస్తావన ఇక్కడ అసందర్భం అనవసరం అవివేకం. సరే అందర్ని సంతృప్తి పరచడానికి ఇండియాలో చైనా లో బంగ్లాదేశ్ లో తయారయ్యి ఇక్కడికి వచ్చిన టీషర్టులు, చాక్లెటు పేకెట్లు, షాంపూలు, సబ్బు బిళ్లలు, మనమెప్పుడు వాడని వాడాలనుకోని బిక్ పెన్నులు కొనేశాను.

ప్రయాణం చేసే రోజు వచ్చేసింది........

మిగతాది తర్వాతి భాగంలో......

**మీరు బలి** – The Conclusion sneek peak (ఏంటి, స్పెల్లింగ్ మిస్టేకా? ఈసారికి యడ్జస్ట్ అయిపొండి):

భారతదేశంలో దిగి విమానాశ్రయం నుండి బయటకి రాగానే దేశభక్తి ఉప్పొంగి, దేశపు గాలి గుండెనిండా పీల్చాను. అంతే తెలియని ఏదో అనుభూతి, కడుపులో మొదలయ్యి గుండెల ద్వారా గొంతులోంచి బయటకి వచ్చింది.. దగ్గు రూపంలో, అప్పుడు అర్థమైంది నేను పీల్చినదాంట్లో గాలి తక్కువ పక్కనోడు తాగి వదిలిన సిగిరెట్ పొగ ఎక్కువ ఉందని. అంతలోనే నాలోని దేశభక్తి మరోమారు ఉప్పొంగింది. మోకాళ్లపై కూర్చుని గట్టిగా నా జన్మభూమిని, అనగా రోడ్డుని ముద్దు పెట్టుకున్నాను. అంతే పెదాలు చురుక్కుమని మండాయి. ఏమి జరిగిందో అర్థంకాక పైకి చూశాను, అక్కడ బగబగ నవ్వుతూ సూర్యుడు, పక్కకి చూశాను, అక్కడ నన్ను చూస్తూ గబగబ పరిగెడుతూ ఒక చీమ, ఈమూలగా చూసాను, సిగరెట్టు నుంచి కాలిన బూడిదని కసిగా వేలుతో కొట్టి విడతీస్తున్న భారతీయుడు. ఇంతకీ నా మీద పగబట్టింది ఎవరు? ఆకాశంలో సూర్యుడా? నేలపై ఉన్న చీమా? పక్కనేఉన్న భారతీయుడా?

ఇంతకీ ఆ పగకి కారణం ఏంటి? తెలుసుకోవాలంటే చదవండి –

మీరు బలి – The Conclusion (2028)

# చమక్కులు

రచన: సునీల్ దొడ్డపనేని

- పైకి ఎక్కేవారిని జార్చడానికి ఒక నీటి చుక్క చాలు, అది బురద నీరు కావొచ్చు, మంచి నీరు కావొచ్చు
- ఆశే లేకపోతె దేవుడితో అవసరం ఉందా?
- పేరు ఒక చిత్రం. నీ పేరు నీకంటే పక్కనోళ్లే ఎక్కువ వాడతారు.
- కలలో వరిస్తే పర్లేదు కానీ అదే కలవరిస్తే ప్రమాదమే.
- నీ జాలి హృదయం ఎక్కువ శాతం jolly గాళ్లకే ఉపయోగ పడుతుంది, తస్మాత్ జాగ్రత్త.
- "ఇంట్లో కుక్కలు ఉన్నాయి" అని బోర్డు పెట్టినోడివి "బయట మనుషులున్నారు జాగ్రత్త" అని కూడా బోర్డు పెట్టు.



# Bronze Sponsors









# Bronze Sponsors

DESI BITES
khate jao




OMAHA
Signature
events

# కృతజ్ఞతాభివందనం

TSN తరంగిణి రూపకల్పనలో సహకరించిన ప్రతి ఒక్కరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ పత్రిక ద్వారా తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, సేవా భావం, మరియు మన సమాజ ఐక్యతను ప్రతిబింబింపజేయగలిగినందుకు మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ మహత్తర ప్రయత్నంలో భాగస్వాములైన రచయితలు, వాలంటీర్లు, ఫోటోలు అందించిన సభ్యులు, పిల్లలు, తల్లిదండ్రులు, మరియు TSN కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

మీ అందరి సహకారం, ప్రోత్సాహం, మరియు అభిమానమే ఈ పత్రికకు బలమైన ఆధారం. మన తెలుగు వెలుగు ఇలాగే తరతరాలకు విస్తరించాలని, మన సంస్కృతి మరింత వెలుగొందాలని మనసారా కోరుకుంటున్నాము.

తెలుగు తేజాన్ని, తెలుగు బాటను, తెలుగు సంస్కృతిని నిలబెట్టే ఈ ప్రయాణంలో ఇలాగే అందరం కలిసి ముందుకు సాగుదాం.

**తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (TSN)**

**TSN** తరంగిణి

**సంపాదక వర్గం:**

**సునీల్ దొడ్డపనేని**

**వీణమాధురి ద్రోణాదుల**

**వేణుగోపాల్ మురకొండ**

మళ్లీ మరో సంచికలో కలుద్దాం... నమస్కారం. 



TSN
తరంగిణి